నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి

1

బుధవారం | ఏప్రిల్ 17, 2024 | www.navatelangana.com

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి



నవతెలంగాణ-నవీపేట్

వడదెబ్బ తగిలి ఉపాధి కూలీ మృతిచెందింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఉపాధి కూలీ ర్యాగల్ల లావణ్య అలియాస్ లక్ష్మి నర్సమ్మ(42) రోజులాగే సోమవారం ఉపాధి హామీ పనుల నిమిత్తం లింగమయ్య గుట్ట చెరువులో పూడికతీత పనులకు వెళ్లింది. లింగమయ్య గుట్ట ప్రాంతంలో ఉపాధి పనులకు వెళ్లిన లావణ్య ఎండ తీవ్రత కారణంగా వాంతులు, విరేచనాలు కలగడంతో హఠాత్తుగా సోమసిల్లి పడిపోయారు. తోటి కూలీలు భర్త రాజశేఖర్ (ఆర్.ఎం.పి)కి ఫోన్ చేయగా అతను వచ్చి 108లో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. చికిత్స చేస్తుండగా ఆ సమయంలో గుండెపోటు రావడంతో ఆమె మృతి చెందారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు.


30 వరకు 144 సెక్షన్ అమలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ విధిస్తూ నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉండనుంది. వరుసగా పండుగలు, పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ నేపథ్యంలో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్న సమయంలో పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, సభలు నిర్వహించరాదు. ముఖ్యంగా ఒకే చోట జనాలు గుమిగూడి ఉండడంపై నిషేధం విధించారు. అందులో భాగంగా 144 సెక్షన్ అమలులో ఉన్నప్పుడు సెక్షన్ పరిధిలో ప్రజలందరూ సహకరించాలి లేకుంటే వారిపై ఈ సెక్షన్ ఉల్లంఘన కింద కేసు నమోదు చేయనున్నట్టు తెలిపారు. 144 సెక్షన్ కు లోబడి ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సీపీ కల్మేశ్వర్ సూచించారు.



మాట్లాడుతున్న షబ్బీర్ అలీ



రేపు నోటిఫికేషన్ విడుదల

లోకసభ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం రాష్ట్రంలో జరగనున్న ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ రేపు(18వ) తేదీనా విడుదల కానుంది. ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్‌లు స్వీకరించనుండగా, 26వ తేదీనా పరిశీలించనున్నారు. నామినేషన్ ల ఉపసంహరణకు ఏప్రిల్ 29వ తేదీ వరకు అవకాశం కల్పించనున్నారు. మే 13వ తేదీనా పోలింగ్ జరగనుండగా, జూన్ 4వ తేదీనా ఫలితాలు విడుదల కానున్నాయి.

బలహీనతలే ప్రచారాస్త్రం

- జోరందుకున్న ప్రచారం
- పేలుతున్న మాటల తూటాలు
- ఎండతో పాటు హీటెక్కిస్తున్న రాజకీయం
- రేపు నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్‌కు సమయం సమీపిస్తున్న తరుణంలో ప్రధాన పార్టీలు ప్రచార జోరును పెంచాయి. ఇది వరకే అభ్యర్థులు ఖరారు కావడంతో మొదట్లో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఆయా పార్టీలు సమావేశాలు నిర్వహించగా.. తాజాగా మండల స్థాయిలో కార్యకర్తల సమావే శాలు నిర్వహిస్తూ ప్రచారంలో జోరు పెంచాయి. చేరికలతో తమ బలం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కాగా ఆయా అభ్యర్థుల బలహీనతలనే ప్రధాన అస్త్రంగా మాటల తూటాలు పేల్చుతున్నారు. జహీరాబాద్ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు తెలుగు రాదని, నియోజకవర్గం లోని మండలాల పేర్లు సైతం తెలవదని కాంగ్రెస్ ప్రధానంగా ప్రచారం చేస్తుండగా.. కాంగ్రెస్ హామీలు ఇచ్చి అమలు చేయడంలో మోసం చేసిందని బీఆర్ఎస్ ప్రచారం చేస్తుంది. అదే విధంగా నిజామాబాద్‌లో సైతం పసుపు బోర్డు ప్రచారాస్త్రంగా మారింది. పసుపు బోర్డు ఎక్కడా అంటూ కాంగ్రెస్ ప్రశ్నిస్తుండగా.. ప్రశ్నించే నాయకులైన బాజిరెడ్డిని పార్లమెంట్‌కు పంపాలని బీఆర్ఎస్ కోరుతోంది.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నిజామాబాద్, జహీరాబాద్ లోక్ సభ స్థానాల్లో ప్రచారం జోరందుకుంది. ఇది వరకు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తమ అభ్యర్థులను ఖరారు చేయగా.. రోజుకొక మండలం చొప్పున కార్యకర్తలు, ముఖ్య అనుచరులతో సమావేశాలు నిర్వహిస్తూ అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు.

పసుపు బోర్డు చుట్టూ రాజకీయాలు



జీవన్‌రెడ్డి(కాంగ్రెస్)



బాజిరెడ్డి గోవర్ధన్(బీఆర్ఎస్)



అరవింద్(బీజేపీ)

నిజామాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో పసుపు బోర్డు అంశాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా ప్రస్తావించింది. బోర్డు తీసుకొచ్చానని ఎంపీ అరవింద్ చెబుతుండటంపై పసుపు బోర్డు ఎక్కడ అని కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ అధికారం లోకి వస్తే జక్రాన్‌పల్లిలో పసుపుబోర్డు ఏర్పాటు చేస్తానని ఆయన ప్రకటించారు. సీనియర్ నాయకులైన జీవన్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తున్నారు. దీంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అమలు చేసిన గ్యారెంటీ పథకాల గురించి విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

కాగా ప్రశ్నించే నాయకులైన బాజిరెడ్డి గోవర్ధన్‌కు అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ ప్రచారం చేస్తుంది. కాంగ్రెస్ రైతు సంక్షేమాన్ని మరిచిందని, రైతులకు సాగునీటి గోస తలెత్తిందని, ఎన్నికలు ఉన్న సమయంలోనే పథకాలు అమలు చేయలేదని, ఎన్నికలు పూర్తికాగానే చేతులెత్తేస్తదని.. బీజేపీ అభ్యర్థి అరవింద్ పసుపు బోర్డు అంటూ మోసం చేశాడని, ప్రచారానికి వస్తే నిలదీయాలని నాయకులు పిలుపునిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే ప్రశ్నించే గొంతుక అయిన బాజిరెడ్డిని గెలిపించాలని కోరుతున్నారు.

బీజే పీ అభ్యర్థి అరవింద్ చేసిన అభివృద్ధి పనులు చెప్పుకోలేక రామనామం జపిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పాటు నోటి దురుసుతనంతో సొంత పార్టీలో సైతం వ్యతిరేకతను మూటగట్టుకున్నారు. ఆయనకు టికెట్ ఇవ్వొద్దంటూ సొంత పార్టీ నాయకులే బహిరంగంగా డిమాండ్ చేయడం గమనార్హం. ఇటీవల ఓ జర్నలిస్టు పట్ల దురుసుగా ప్రవర్తించడం పట్ల ఆయన వైఖరి మరోసారి వివాదాస్పదం అయింది.

జహీరాబాద్‌లో పేలుతున్న మాటల తూటాలు



సురేశ్‌షెట్కార్(కాంగ్రెస్)



గాలి అనిల్‌కుమార్ (బీఆర్ఎస్)



బీబీ పాటిల్ (బీజేపీ)

జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య మాటల తూటాలు పేలుతు న్నాయి. అభ్యర్థుల బలహీనతలు ప్రధానంగా చర్చకు పెట్టి ఓటర్లను ఆలోచింపజేస్తున్నారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులపై విరుచు కుపడుతుంది. బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ పదేండ్లు ఎంపీగా వ్యవహరించినా పలు మండ లాల్లో, గ్రామాల్లో కనీసం పర్యటిం చలేరని, ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని మండ లాల పేర్లు సైతం తెలవదని ఎద్దేవ చేస్తూ ప్రచారం చేపడుతున్నారు. బీఆర్ఎస్ పదేండ్లు అధికారం లో ఉన్నా.. నీటి సమస్య తీర్చలేదంటూ విమర్శిస్తున్నారు. కాగా బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు విస్మరించడంపై ప్రధానంగా ఫోకస్ చేస్తుంది. రైతుబంధు పెంపు, పెన్షన్, ఉద్యోగాల భర్తీ తదితర అంశాలను ప్రశ్నిస్తూ.. వాటిని అమలు చేయించేందుకు బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరుతున్నారు. ఇక బీబీపాటిల్.. అభివృద్ధి పనులు చేపట్టేందుకే పార్టీ మారానని, మరోసారి అవకాశం కల్పిస్తే అభివృద్ధి పనులు చేపడతానని ప్రచారం చేపడుతున్నారు.

బిజినెస్ కోసం కండువాలు మార్చేవారు

మనకు అవసరమా..?

- కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

నవతెలంగాణ-భిక్కనూర్

బిజినెస్‌ల కోసం కండువాలు మార్చె ఎంపిలు మనకు అవసరమా అని కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి సురేష్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. మంగళవారం భిక్కనూరు పట్టణంలోని ఎస్.వి గార్డెన్ లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఎన్నికల సందర్భంగా ఇచ్చినమాట ప్రకారం 6 గ్యారంటీ పథకాలలో ఇప్పటికె 5 పథకాలు అమలు చేశామని, ఎన్నికల తరువాత ఆగస్టు నెలలో 2 లక్షల రుణమాఫీ చేయనున్నట్టు తెలిపారు. ఇండ్లులేని వారికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మించడంతో పాటు స్థలం ఉన్నవారు ఇళ్ళు కట్టుకునెందుకు 5 లక్షల రూపాయల సహాయం అందజేయనున్నట్టు తెలిపారు.

ఎంపి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీమెజారిటితో గెలిపిస్తే ప్రతిమహిళకు 1 లక్ష రూపాయలు సహాయం మరిన్ని సంక్షేమ పథకాలు రాహుల్ గాంధీ న్యాయకత్వంలో అమలు చేయనున్నట్టు తెలిపారు.

భిక్కనూరు మండలంలోని ప్రతి గ్రామం నుండి కాంగ్రెస్ పార్టీకి భారీ మెజార్టీ తీసుకురా వాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు గ్రామా లలో విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలకు వివరిం చాలన్నారు. ప్రతి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్త లు పార్లమెంట్ ఎన్నికలు ముగిసే వరకు అలసి పోకుండా పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. అంతకుముందు కాచాపూర్ నుండి డిసిసిబి డైరెక్టర్ కిష్టగౌడ్, మాజి జెడ్పిటిసి బైండ్ల సుదర్శన్, ఇసాన్నపల్లి మాజి సర్పంచ్ రాములు, బస్వాపూర్, అంతం పల్లి, జంగంపల్లి, తిప్పాపూర్, మోటాటి పల్లి, గుర్జకుంటా, 18 గ్రామాల నుండి బిఆర్ఎస్, బిజెపి పార్టీ నాయకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఇంద్ర కరణ్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, డిసిసి ఉపాధ్యక్షులు చంద్ర కాంత్ రెడ్డి, ఎంపిపి గాల్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు భీం రెడ్డి, ఎన్నారై సెల్ జిల్లా అధ్యక్షు లు సుధకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుద ర్శన్, పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, నాయకు లు నర్సింహా రెడ్డి, భూమయ్య, సిద్ధరాములు, లింగ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి

డబ్బులు ఎప్పటికప్పుడు చెల్లించాలి

- ధాన్యం డబ్బులు రైతులకు పెండింగ్ ఉంచొద్దు
- ప్రిన్సిపల్ సెక్రెటరీ దేవేంద్ర సింగ్ చౌహాన్ వెల్లడి
- రైస్ మిల్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ధాన్యం పరిశీలిస్తున్న దేవేంద్రసింగ్ చౌహాన్

యాసంగి సీజన్ కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాలలో ప్రభుత్వపరంగా నెలకొల్పిన కొనుగోలు కేంద్రాల ద్వారా రికార్డు స్థాయిలో ఇప్పటికే 2.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేశామని, ధాన్యం విక్రయించిన రైతులకు వెంటదివెంట బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దేవేంద్ర సింగ్ చౌహాన్ తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తదితరులతో కలిసి జిల్లాలోని రైస్ మిల్లులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. అంతకు ముందు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో అధికారులు, రైస్ మిల్లర్లతో సమావేశం అయ్యారు. అనంతరం గుండారం గ్రామంలోని జై గణేష్ ప్యాడి ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్(రైస్ మిల్)ను సందర్శించి, ధాన్యం మర పడుతున్న తీరును, స్టాక్ నిల్వలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందల్వాయి మండలంలోని గన్నారం, చంద్రయాన్ పల్లి గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ కేంద్రాలకు రైతులు తరలించిన ధాన్యం నిల్వలను పరిశీలించి, మాయిశ్చర్ యంత్రం ద్వారా తానే స్వయంగా తేమ శాతాన్ని కొలిచారు. 17 శాతానికి లోబడి తేమ శాతం ఉండేలా చూసుకోవాలని, ఈ మేరకు ఎఫ్.ఏ.క్యూ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రైతులు ధాన్యం తెచ్చేలా వారికి అవగాహన కల్పించాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ అధికారులకు సూచించారు.

కేంద్రాలలో రికార్డులను పరిశీలించి, ఇప్పటివరకు ఎంత ధాన్యం సేకరించారు అనే వివరాలను ఆరా తీశారు. ఈ కేంద్రాలలో ధాన్యం విక్రయించిన రైతులు పల్లా సందీప్, మల్లయ్య, చెవుల పెద్ద సాయిలును సెల్ ఫోన్ ద్వారా సంప్రదించి, బిల్లుల చెల్లింపులు జరిగాయా? కొనుగోలు కేంద్రాలలో ఏమైనా సమస్యలు ఎదురయ్యాయా? సిబ్బంది ప్రవర్తన ఎలా ఉంది? తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. బిల్లులు తమ బ్యాంకు ఖాతాలలో జమ అయ్యాయని, కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని, సకాలంలో ధాన్యం తూకం జరిగిందని రైతులు తెలుపగా, ప్రిన్సిపల్ కార్యదర్శి సంతృప్తి వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను అభినందిస్తూ, వారికి ప్రశంసా పత్రాలు అందజేయాలని తన కార్యాలయాల అధికారులను ఆదేశించారు. ఇదే తరహాలో కొనుగోలు కేంద్రాలను సజావుగా నిర్వహించాలని, రైతులకు అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచుతూ బిల్లుల చెల్లింపుల్లో జాప్యానికి తావులేకుండా వెంటదివెంట ట్యాబ్ లో వివరాలు నమోదు చేయాలని సూచించారు.

ఇందల్ వాయి సహకార సొసైటీ పరిధిలోని గన్నరం వద్ద ఉన్న వారి కొనుగోలు కేంద్రాన్ని అకస్మాత్తుగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఇతర శాఖల అధికారులతో కలిసి సందర్శించారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన వాటి వివరాలను సహకార సొసైటీ సీఈవో ఉప్పల్‌వాయి రతన్‌ను అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లుల నుండి వచ్చిన కొనుగోలు షీట్లు సహకార సొసైటీ ఆధ్వర్యంలో ఉన్న బుక్కులను పరిశీలించి కొనుగోలు పూర్తయిన పలువురు రైతులతో ప్రిన్సిపాల్ సెక్రెటరీ దేవేంద్ర సింగ్ చౌహాన్ నేరుగా మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో లారీల్లో ఎలాంటి ఇబ్బందులు కాలేదని ఆ రైతు ఫోన్ లో సమాధానం ఇచ్చారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ

మహిళా రైతు నుంచి చైన్‌స్నాచింగ్

నవతెలంగాణ-మోపాల్

ధాన్యం ఆరబెడుతున్న మహిళా రైతు మెడలో నుంచి చైన్‌స్నాచింగ్ ఘటన మోపాల్ మండలం కంజర గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కంజర గ్రామానికి చెందిన అరికెల లక్ష్మి గత రెండు రోజుల నుండి వడ్లను రోడ్డుపైన ఎండబడుతూ ఉంది. ఆదివారం రోజు ఒంటరిగా ఉన్న లక్ష్మీని చూసి స్కూటీపై వచ్చిన ఇద్దరు దొంగలు ఆమెను మాటల్లో దింపి మెడలో నుండి దాదాపు మూడు తులాల విలువ గల బంగారు గొలుసును తెంపుకొని పరారయ్యారు. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో మోపాల్ ఎస్ హెచ్ ఓ గంగాధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు . అలాగే నిందితుల కోసం చుట్టుపక్కల ఉన్న గల సీసీ కెమెరాలు ద్వారా చూసి పట్టుకునేందుకు పర్యవేక్షిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన ఘటన జన్నపల్లి రోడ్డుపై మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన ముగ్గురు ముగ్గురు స్నేహితులు దిలారి రవి, దిలారి ప్రభాకర్, జె. రాజు గ్రామ శివారులోని పొలాలలోకి మలవిసర్జనకు వెళ్లి వారి బైక్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో జన్నపల్లి రోడ్డు పైకి రాగా ఒక ఎఫ్ సి ఐ బియ్యం లోడ్ తో గల ఐచర్ వ్యాన్ దాని డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడిపి వీరు వస్తున్నా మోటార్ సైకిల్ కు టక్కరి ఇవ్వగా ప్రైవేటు ఉద్యోగం చేసే దిలారి ప్రభాకర్(33) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు రూరల్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో మహేశ్ తెలిపారు.

గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- పొరపాట్లకు తావివ్వొద్దు
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా జూన్ 9 న నిర్వహించే గ్రూప్-1 పరీక్ష పకడ్బం దీగా నిర్వహించుటకు అధికారులు ముందస్తు ప్రణాళికతో సన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో టీఎస్ పీఎస్ సి ద్వారా నిర్వహించే గ్రూప్-1 పరీక్షల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు.

జిల్లాలో పరీక్షలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుటకు అన్ని ముందస్తు చర్యలు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు కేటాయించే అభ్యర్థులకనుగుణంగా కామారెడ్డి పట్టణంలో 12 పరీక్షా కేంద్రాలను గుర్తించామని అన్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించవలసిన గురుతర బాధ్యత చీఫ్ సూపరింటెండెంట్లదేనని, యువేత భవిష్యత్తు మీ చేతులో ఉందని, ఎటువంటి చిన్న తప్పిదాలకు అవకాశమివ్వక లయజన్ అధికారులతో సమన్వయము చేసుకుంటూ ముందస్తుగా పరీక్షా కేంద్రాలను సందర్శించి అన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. డిపార్ట్మెంటల్ అధికారులను, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను,రూట్ అధికారులను, ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రశ్నాపత్రాలను స్ట్రాంగ్ రూంలో భద్రాపరచాలని, జవాబుపత్రాలను జాగ్రత్తగా రవాణా చేయాలన్నారు.

అభ్యర్థులను సునిశితంగా పరిశిలించి బయోమెట్రిక్ విధానం ద్వారా పరీక్ష హాలులోకి లోపలికి అనుమతించవలసి ఉంటుందని, ఎలక్ట్రానిక్ గాడ్జెస్, చరవాణి, అనుమతించరాదని స్పష్టం చేశారు. ప్రతి కేంద్రం సి.సి.కెమెరా నిఘాలో ఉండేలా చూడాలనున్నారు. గదులలో సరైన వెలుతురు ఉండేలా చూడాలని, ఎట్టి పరిస్థితులలో విద్యుత్ లో అంతరాయంలేకుండా చూడాలని, మంచి నీరు, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు, ప్రథమ చికిత్సకు ఆశా కార్యకర్తలను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ కేంద్రాలు మూసివేయించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నరసింహ రెడ్డి, ఆర్డీఓ రంగనాథ్ రావు, డీఈఓ రాజు, సహాయ పరీక్షల కమీషనర్ లింగం, జిల ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, తహసీల్దార్ జనార్దన్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖా నుండి ప్రతినిధులు పాల్గొన్నారు.

కొమ్మలు అడ్డొస్తే.. చెట్లు నరికివేత

- ప్రతిష్టాత్మకంగా పెంచి.. అడ్డంగా నరికివేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మొక్కలను నాటి వాటికి రోజూ నీరు అందించి సంరక్షించి పెంచి పెద్ద చేస్తే.. విద్యుత్ తీగలకు అడ్డొస్తున్నాయని విద్యుత్‌శాఖ అధికారులు అడ్డంగా నరికివేశారు. కొమ్మలు తొలగించాల్సి ఉంది పోయి ఏకంగా చెట్లను పూర్తిగా తొలగిస్తున్నారు.

గత బిఅర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించి హరితహారం కార్యక్రమం చేపట్టారు. ప్రతి సారి కార్యక్రమం నిర్వహించినప్పుడల్ల గ్రామ పంచాయతీ లకు వేల సంఖ్యలో టార్గెట్ విధించారు. దానిలో భాగంగానే ఆయా గ్రామాలలో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో వేలాది, లక్షలాది రూపాయలు వేచ్చించి ప్రభుత్వ, ప్రయివేటు ఖాళీ స్థలాల్లో, ఎవెన్యూ ప్లాంటేషన్లు, గ్రామ నర్సరీ లను నెలకొల్పి మొక్కలను నాటించారు. నర్సరీలో విత్తనాలు వేసి , 8-10 నెలలు జాగ్రత్తగా పెంచి , చిన్న చిన్న మొక్కలను నాటి , ట్రాక్టర్ టాంకర్ ద్వారా ఉపాధిహామీ కూలీలతో ప్రతి మొక్కను రక్షించేందుకు నీరు పోసి దానిలో కంపోస్ట్ ఇతర ఎరువులు వేసి ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చిన హరితహారం లక్ష్యాలను ను చేరుకోవడానికి అహర్నిశలు కష్టపడి పెద్దయ్యేలా కంటికి రెప్పలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇక్కడి వరకు అంత బాగే ఉంది. అనాడు నాటిన మొక్కలు నేడు పలు చోట్ల వృక్షాలుగా అయ్యాయి.

వర్ష కాలం వస్తుందని, విద్యుత్ లైన్లకు కొమ్మలు తగిలి సరఫరా నిలపకుండ ఉండేందుకు కొమ్మలను తొలగిస్తు ఉంటారు. కానీ విద్యుత్ లైన్‌కు నాడు పెట్టిన మొక్కలు నేడు అడ్డం వస్తున్నాయనే కారణంతో కొమ్మలను తొలగించకుండా మొత్తం చెట్లనే కంటికి కనబడిన చోట విద్యుత్ శాఖా సిబ్బంది రాహదారుల వెంబడి అడ్డు అదుపు లేకుండా తొలగించేస్తున్నారు.

ఇందల్‌వాయి మండలంలోని గండి తండాకు వెళ్లే రాహదరి వెంట దాదాపు 30 చెట్లను , 4-5 మీటర్ల ఎత్తు కలవి తొలగించినట్లు స్థానికులు తెలిపారు. ఇదే కాకుండా ఇందల్ వాయి, డిచ్ పల్లి మండల కేంద్రలతో పాటు ఆయా గ్రామాలలో సైతం ఇదే విధంగా చెట్లను తొలగించినట్లు ఆయా గ్రామాలకు చెందిన పలువురు తెలిపారు. డిచ్ పల్లి నుండి నిజామాబాద్‌కు వెళ్లే రాహదరి వెంట కూడా చెట్లను నరికివేసినట్లు సమాచారం.

ఎంతో శ్రమకోర్చి పెంచిన చెట్లను మొత్తంగా నరికివేయకుండా కొమ్మలను నరికివేయాలని స్థానికులు కోరుతున్నారు. అదే విధంగా మొక్కలను నాటే సమయంలో విద్యుత్‌వైర్‌ల కింద నాటకుండా ఉండే విధంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఏపుగా పెరిగిన చెట్లను నరికివేసిన విద్యుత్‌శాఖ సిబ్బంది

2
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
బుధవారం | ఏప్రిల్ 17, 2024 | www.navatelangana.com

కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు

- సీఎం సమక్షంలో చేరిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీలో చేరిన్న మాజీ ఎమ్మెల్సీ

సాయిబాబా మందిరంలో నేడు శ్రీరామనవమి ఉత్సవాలు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మాధవ నగర్‌లోని సాయిబాబా మందిరంలో నేడు శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి చారిత్రాత్మకంగా ప్రాధాన్యత ఉన్న ద్వితీయ షిరిడిగా పిలవబడుతున్న సాయిబాబా మందిరంలో శ్రీ క్రోధి నామ సంవత్సర శ్రీ రామ నవమి ఉత్సవాలు భక్తుల, దాతల సహాయ సహకారంతో ఘనంగా జరగనున్నాయని సాయిబాబా దేవస్థానం కార్య నిర్వహణ అధికారి రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవమి ఉత్సవాలకు వచ్చే అశేష భక్తులు దేవస్థానం యొక్క సిబ్బందికి సహకరించాలని, అందరికీ సరిపడా ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయని పేర్కొన్నారు.



యథేచ్ఛగా ఇసుక రవాణా

- డంపింగ్‌చేసి నిజామాబాద్‌కు తరలింపు


డంప్‌చేసిన ఇసుక

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంలోని ముదక్ పల్లి శివారులోగల పెద్ద వాగు నుండి యథేచ్ఛగా రాత్రిళ్ళు ఇసుక డంపింగ్‌చేసి నిజామాబాద్‌కు తరలిస్తున్నారు. గ్రామాల్లో వీఆర్‌ఓ వ్యవస్థ ఉంటే ఇక్కడ ఏం జరుగుతుందనేది రెవెన్యూ యంత్రాంగానికి సమాచారం ఉండేది. అక్రమంగా మొరం, ఇసుక రవాణా చేసే వారికి గుర్తించి సంబంధించిన అధికారులకు తెలియజేసేవారు. వీఆర్‌ఓ వ్యవస్థని తీసేసినప్పటినుండి అక్రమంగా ఇసుక మొరం తవ్వేవారికి అడ్డు అదుపు లేకుండా పోయింది. వీఆర్‌ఓ వ్యవస్థ ఉంటే వారు అనుక్షణం మరొక సమాచారం ఇవ్వడం వల్ల వారి పైన చర్యలు ఉండేవి. అర్ధరాత్రి ఈతంతంగం సాగిస్తున్నట్లు సమాచారం. పోలీసులైనా పెట్రోలింగ్ చేస్తూ సంబంధించిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మాజీ మంత్రులకు సన్మానం

- నగరంలోని ఓహోటల్లో కలిసిన నాయకులు


మాజీ మంత్రులను సన్మానించిన్న టీడీపి నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, నక్క ఆనంద్ బాబులను టిడిపి నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా నగరంలోని లహరి ఇంటర్నేషనల్ హెూటల్లో కలిసి శాలువాతో సన్మానించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పుడు రాష్ట్రానికి నష్టం వాటిల్లుతుందని బాబ్లీ ప్రాజెక్ట్ విషయంలో జరిగిన ఉద్యమ కేసులలో భాగంగా నాందేడ్ జిల్లా బిలోలి లో కోర్టుకు వెళ్తున్నారు. మార్గ మధ్యలో నగరంలోని లహరి ఇంటర్నేషనల్ హెూటల్లో అల్పాహారం కోసం ఆగిన సమయంలో నిజామాబాద్ టిడిపి పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి శాలువాతో సత్కరించారు. నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ పార్టీ సంస్థాగత విషయాలపై వారితో చర్చించారు. కార్యక్రమంలో అర్బన్ ఇంఛార్జి వినోద్ కుమార్, నిజాంబాద్ రూరల్ ఇంచార్జ్ నాగేశ్వరరావు, అర్బన్ అధ్యక్షులు అంబిక సత్యనారాయణ, బిజినెస్ సెల్ అధ్యక్షులు బోబ్బ నరసింహ రావు, అర్బన్ జనరల్ సెక్రటరీ శంకర్ ముదిరాజ్, లవంగ రాజు, వేముల నాగేశ్వరరావు, రాములు నాగారం, బోబ్బ సద్గుణ రావు, గంగోన్ రాజేశ్వర్, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఓటర్లకు అవగాహన


మాట్లాడుతున్న తహసిల్దార్ ఆంజనేయులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హసకొత్తూర్‌లో గ్రామ మహిళలకు ఓటరు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ఆంజనేయులు మాట్లాడుతూ.. ఈనెల 25లోపు ఓటు హక్కు కోసం బీఎల్‌ఓల దగ్గర లేదా మీ సేవ కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఖచ్చితంగా మే 13న లోక్ సభ ఎన్నికల్లో ఓటును వినియోగించుకోవాలని తెలిపారు. ఓటర్ కార్డుల్లో ఏవైనా తప్పులు ఉంటే సరిదిద్దుకునేందుకు ఈనెల 25వ వరకు అవకాశం ఉందని. దీన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రలోభాలకు లొంగకుండా సరైన అభ్యర్థిని ఎన్నుకోవాలని ఓటర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస్, మండల విద్యాధికారి ఆంధ్రయ్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శరత్, సెర్ప్ మండల ఏపీఎం కుంట గంగాధర్, గ్రామ సమైక్యల సభ్యులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య ఆరో తరగతికి ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ఈ నెల 28న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసిన విద్యార్థులు అడ్మిట్ కార్డును డౌన్లోడ్ చేసుకోవాలని, తమకు కేటాయించిన పరీక్ష కేంద్రానికి నిర్ణీత సమయంలో హాజరుకావాలని కోరారు. ఏకలవ్య మోడల్ గురుకుల ప్రవేశ పరీక్ష రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో నిర్ణేత ఆమెనే

- ఉమ్మడి జిల్లాలో మహిళా ఓటర్లే అధికం
- ఆమెకు ప్రాతినిధ్యం కరువు
- మహిళల ఓట్లకోసం పార్టీల గాలం

నవతెలంగాణ-ఆర్మూర్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు ఓటములు నిర్దేశించే స్థాయికి మహిళలు చేరుకున్నారు. అన్నిటిలో సగం ఆమెది నిర్ణయాధికారం అయినా ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాల నుండి మహిళలకు ప్రాతినిధ్యం దక్కలేదు ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో సైతం కూడా...



ఉమ్మడి జిల్లాల్లో...

ఉమ్మడి జిల్లాలో పురుషుల కంటే మహిళ ఓటర్ల శాతం ఎక్కువగా ఉండడంతో గెలిచే అభ్యర్థి ఎవరు తర్వాతి స్థానంలో నిలిచేవారు ఎవరని నిర్ణయించే శక్తి మహిళ ఓటర్లకే ఉంది. జిల్లాలోని బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్ నియోజకవర్గాలతో పాటు బాన్సువాడ నియోజకవర్గం పరిధిలో ఐదు మండలాలు ఉన్నాయి. ఆరు నియోజకవర్గాల ఓటర్ల సంఖ్య అందులో నమోదైన మహిళ ఓటర్ల లెక్కను పరిశీలిస్తే వారి ఓట్ల సంఖ్యని ఎక్కువగా ఉందని తేలింది.. పురుషుల ఓటర్లలో అనేక మంది ఉపాధి కోసం గల్ఫ్ దేశాలతో పాటు పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లినవారు ఉన్నారు. ఈ లెక్కన మహిళలు వేసి ఓట్లే అభ్యర్థుల గెలుపునకు కీలకం కానున్నవి. అత్యధికంగా రూరల్ నియోజకవర్గంలో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండగా తర్వాత బాల్కొండ నియోజకవర్గంలో మహిళ ఓటర్ల సంఖ్య పురుషులకంటే ఎక్కువగా ఉంది.

ఒకే ఒకసారి ఎంపీగా మహిళను గెలిపించిన ఓటర్లు...

1952 సంవత్సరంలో పార్లమెంట్ ఎన్నికలు మొదలైన నాటి నుంచి ఇప్పటివరకు 17 సార్లు ఎన్నికలు జరగగా ప్రస్తుతం 18 వ పార్లమెంట్ ఎన్నికల పోరు నడుస్తుంది . 17 సార్లు ఎన్నికలు జరుగగా 16 దఫాలుగా పురుషులే ఎంపీగా ప్రాతినిధ్యం వహించగా ఒకే ఒకసారి మహిళలకు అవకాశం వచ్చింది. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత జరిగిన 2014పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాకు చెందిన కల్వకుంట్ల కవితకు ఓటర్లు మద్దతు పలికి ఎంపీగా గెలిపించి పార్లమెంటుకు పంపారు. ప్రస్తుతం ఢిల్లీ మద్యం కేసులో 100 కోట్ల ముడుపులు ముట్టజెప్పి నేరపూరిత కుట్రలో కీలక పాత్ర పోషించినట్టు అరెస్టు చేశారు.

ఆరు నియోజకవర్గాల్లో ఓట్ల వివరాలు...

మొత్తం 13,65,811 కాగా ఇందులో పురుషులు 6,47,149, మహిళలు7,18,603 ఇతర ఓటర్లు 59 కాగా మహిళలు 71,454 ఎక్కువగా ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా....

బాల్కొండ నియోజకవర్గంలో మహిళ ఓటర్లు 1,15,898, పురుష ఓటర్లు 99,728, ఎక్కువగా ఉన్న మహిళలు 16,170, ఆర్మూర్ నియోజకవర్గంలో మహిళ ఓటర్లు 1,09,933, పురుష ఓటర్లు 96,404 ఎక్కువగా ఉన్న మహిళలు 13,529, జిల్లాలోని అర్బన్ యందు మహిళా ఓటర్లు 1,47,571, పురుష ఓటర్లు 1,39,163 ఎక్కువగా ఉన్న మహిళలు 8,408, రూరల్‌లో మహిళ ఓటర్లు 1,32,212, పురుష ఓటర్లు 99,728 ఎక్కువగా ఉన్న మహిళలు 32,484, బోధన్ నియోజకవర్గం నుండి మహిళ ఓటర్లు 1,12,381 పురుష ఓటర్లు 1,03,577, ఎక్కువగా ఉన్న మహిళలు 8,804, బాన్సువాడ నియోజకవర్గం నుండి మహిళ ఓటర్లు1,00,608, పురుష ఓటర్లు 92,225,ఎక్కువగా ఉన్న మహిళలు8,383 ఉన్నారు.

మహిళల ఓట్లకోసం గాలం...

అన్ని నియోజకవర్గాలలో మహిళ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండడంతో వారిని ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు దూకుడు పెంచారు. ఈనెల 18న నోటిఫికేషన్ విడుదలై, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యాక ప్రచార పర్వాన్ని మరింత ఉధృతం చేయనున్నారు.. లోక్‌సభ ఎన్నికల్లో ఇంటింటికీ తిరిగి ఓటు అడిగే పరిస్థితి లేకపోవడంతో నాయకులు గత రంజాన్ ఇఫ్తార్ విందులు, శుభకార్యాలు, సామాజిక వేత్తల జయంతి తదితర కార్యక్రమాల్లో కలుస్తున్నారు. గెలుపే లక్ష్యంగా లోక్ సభ బరిలో నిలిచిన అభ్యర్థులు పార్టీ శ్రేణులను సమయాత్తం చేస్తున్న మహిళ ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

నిర్ణయాత్మక శక్తిగా...

అన్ని రంగాల్లో నేడు మహిళలు ముందుం టున్నారు.. మహిళా ఓటర్లే అధికంగా ఉండడంతో వారే నిర్ణయాత్మక శక్తిగా మారారు.

ఝాన్సీ రాణి, వైద్యురాలు, ఆర్మూర్



ఓటు వజ్రాయుధం లాంటిది

ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధం లాంటిది. నిస్వార్థపు పనులు చేసే నాయకులను ఎన్నుకోవాలి.

**డాక్టర్ ప్రణతి రెడ్డి
దంత వైద్యురాలు, ఆర్మూర్..**



ప్రతి కూలికి జాబ్ కార్డు ఇవ్వాలి

- అఖిల భారత ప్రగతి-శీల రైతు సంఘం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ప్రతి కూలికి జాబ్ కార్డు ఇవ్వాలని, కూలీలందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సారా సురేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని హస కొత్తూర్ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సారా సురేష్ మాట్లాడుతూ ప్రతి కూలికి జాబ్ కార్డు, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కూలీలందరికీ ప్రతివారం డబ్బులు చెల్లించాలని, ప్రతి మనిషికి 200 రోజులకు తగ్గకుండా పని కల్పించాలన్నారు. పని ప్రదేశంలో నీటి వసతి కల్పించడంతోపాటు కూలీలు సేన తీరేందుకు టెంట్ సౌకర్యం కల్పించాలన్నారు. పనిచేసే సందర్భంలో చిన్నచిన్న గాయాలు అయితే ప్రథమ చికిత్స కోసం మందుల కిట్లను, గుల్కోస్ పౌడర్ సరఫరా చేయాలని కోరారు. కొలతలు లేకుండా పని కల్పించాలని, ప్రతి కూలికి రూ.ఆరు వందలు రోజువారీగా ఇవ్వాలన్నారు. 2006లో ఇచ్చిన జాబ్ కార్డులు తప్ప ఇంతవరకు జాబ్ కార్డులు ఇవ్వలేదని వెంటనే కొత్త జాబ్ కార్డులు ఇవ్వాలన్నారు. పనిముట్లు ఇవ్వాలని, గడ్డపారలు సాన పెట్టించుకునేందుకు అదనంగా డబ్బులు చెల్లించాలని, కూలీలకు ఆటో చార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో చనిపోయిన వారందరికీ రూ.పది లక్షల ఇన్సూరెన్స్ చేయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం కమ్మర్ పల్లి మండల అధ్యక్షులు ఉట్నూర్ బాలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నిజామాబాద్ జిల్లా కోశాధికారి బి.అశోక్, సత్యక్క, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

అగ్నిప్రమాదాల్లో జాగ్రత్తలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

నవతెలంగాణ - బాల్కొండ

అగ్నిమాపక శాఖ వారోత్సవాల సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని కేసీఆర్ కాలనీలో కాలనీవాసులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఇంట్లో ఉపయోగించే ఎల్పిజి గ్యాస్ సిలిండర్ ద్వారా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన మెళకువలు కాలనీవాసులకు నేర్పించారు. అనంతరం అతిమాపక శాఖ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ బి.శేఖర్, ఫైర్ మాన్ నరేష్, హెూంగార్డ్ పి.వికాస్, డ్రైవర్ టి.సుభాష్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ఆంగ్ల టిచర్‌కు డిఐఈఓ అభినందనలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మారుతున్న సమాజానికి అనుగుణంగా డిజిటల్ విద్యాబోధనను ఉపయోగించి రుద్రూర్ ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడుగా డాక్టర్ శ్రీనివాస్ రాజు విద్య బోధన చేసినందుకు గాను జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి రవికుమార్ అభినందించారు. ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరానికి సంబంధించిన ఆంగ్ల సిలబస్‌ను టి - సాట్ ద్వారా బోధించినందుకు రాష్ట్ర ఇంటర్మీడియట్ వారు పంపిన ప్రశంసా పత్రాన్ని డాక్టర్ శ్రీనివాస్ రాజుకు మంగళవారం అందజేశారు. భవిష్యత్తులో ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులకు మంచి విషయ పరిజ్ఞానాన్ని అందించాలని డిఐఇఓ తెలిపారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించడం అభినందనీయం

- మెగా టవర్స్ అపార్ట్మెంట్ అధ్యక్షులు జెస్సు అనిల్ కుమార్

నవతెలంగాణ-ఆర్మూర్

అగ్నిప్రమాద అమరవీరులకు నివాళులు అర్పించడం అవగాహన కార్యక్రమాలు చేయడం అభినందనీయమని పట్టణంలోని మేఘ టవర్స్ అపార్ట్మెంట్ అధ్యక్షులు జెస్సు అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం మెగా టవర్స్‌లో అగ్నిమాపక అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1944 సంవత్సరంలో బొంబాయి మహానగరం నౌకాశ్రయంలో విక్టోరియా డాక్ వద్ద సంభవించిన అత్యంత ఘోర అగ్ని ప్రమాదం యావత్ దేశాన్ని దిగ్భ్రాంత పరచిందన్నారు. ఆ ప్రమాదంలో అగ్నిమాపక సిబ్బంది 71 మంది ఆ మంటలను ఆర్పడంలో విధి నిర్వహణలో అమరులైన వారిని స్మరిస్తూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 నుండి 20 వరకు ప్రత్యేక వారోత్సవాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అగ్నిమాపక అగ్ని ప్రమాదాలు సంభవించినట్లయితే ఏ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మధుసుదన్ రెడ్డి, సిబ్బంది అవగాహన కల్పించారు ఈ కార్యక్రమానికి విచ్చేసి అవగాహన కల్పించిన అగ్ని మాపక సిబ్బందికి మెగా టవర్స్ అపార్ట్మెంట్ అధ్యక్షులు జెస్సు అనిల్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మెగా టవర్స్ అపార్ట్మెంట్ సభ్యులు పుత్తూరి ప్రదీప్, కొండ్రా రాజేశ్వర్, తమ్మి మారుతి, నల్ల వెంకటరామిరెడ్డి మహిళలు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఫైర్ సిబ్బంది, అపార్ట్‌మెంట్ వాసులు

హనుమాన్ మాల ధారణ స్వాములకు నీటి వసతి ఏర్పాటు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి కమ్మర్‌పల్లి వారి ఆధ్వర్యంలో హనుమాన్ మాల ధారణ స్వాములకు చల్లని మంచినీటిని అందించే వసతిని బుధవారం ప్రారంభించారు. మండల కేంద్రంలో 63వ నంబర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న భాస్కర్ కిరణా షాప్ వద్ద వేసవి ఎండలు అధికంగా ఉన్నందున హనుమాన్ మాలధారణ స్వాములు తమ దాహార్తిని తీర్చుకునేందుకు వీలుగా చల్లని తాగునీరు అందించే ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వుట్నూర్ రాజశేఖర్, దొంతుల రమణయ్య, నరేందర్, భోగ రామస్వామి, అన్నం గణపతి రాం, అజయ్, చిటికేసి రఘు, హనుమాన్ మాల ధారణ స్వాములు ధోని, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

సత్ఫలితాలిస్తున్న కేటీఎస్ విద్యాసంస్థలు

- కేటిఎస్ విద్యా సంస్థల చైర్మన్ రాజు సంగని



నవతెలంగాణ-బాల్కొండ

రాష్ట్రంలో కృష్ణవేణి విద్యా సంస్థలు మంచి సత్ఫలితాలి స్తున్నాయని ఇందుకు కేటీఎస్ విద్య సంస్థలలో చదివిన విద్యార్థిని, విద్యార్థులు మెయిన్స్, జేఈఈ, ఐఐటీలో మంచి ర్యాంకులను సాధించి తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తెస్తున్నారని రాష్ట్ర కృష్ణవేణి విద్య సంస్థల చైర్మన్ రాజు సంగని అన్నారు. బాల్కొండ మండల కేంద్రంలోని పాండురంగ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం కృష్ణవేణి ఉన్నత పాఠశాల "గ్రాడ్యుయేషన్ డే" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చుని, ఆ పట్టుదలతోనే కేటీఎస్‌లో విద్య అభ్యసించిన ఎందరో విద్యార్థులు వివిధ దేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని అన్నారు. ప్రీ ప్రైమరీ విద్యార్థులు ప్రైమరీ విద్యకు వెళ్తున్న చిన్నారి విద్యార్థి, విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే పట్టాలను, మెడల్స్‌ను అందించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు కోటగిరి బాను చందర్, ఆకుల లక్ష్మణ, ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు


బోనాలతో వెళ్తున్న గౌడకులస్తులు

నవతెలంగాణ సిరికొండ

మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక మాత ఎల్లమ్మ పండుగ ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం ఇంటింటినుండి బోనాలను తీశారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలను సమర్పించారు. గౌడ సంఘం కుటుంబ సభ్యులతో కలిసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సిరికొండ గౌడ సంఘం అధ్యక్షులు హన్మగౌడ్, కోశాధికారి రాజేందర్ గౌడ్, సభ్యులు రాజ గణేష్ గౌడ్, రామస్వామి గౌడ్, లక్ష్మి నారాయణ గౌడ్, రాజేందర్ గౌడ్, రాజగౌడ్, రామగౌడ్, పెంటగౌడ్, రాజ్ బహదూర్ గౌడ్, నాగభూషణం గౌడ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

34వ వార్డులో ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని 34 వార్డులో శాసనసభ్యులు పైడి రాకేష్ రెడ్డి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రచారంలో ఇంటింటా తిరుగుతూ బిజెపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా మాజీ అధ్యక్షులు నూతల శ్రీనివాస్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-బిచ్కుంద

మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ జాతీయ సేవా పథకం యూనిటీ ఆధ్వర్యంలో డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు మండలంలోని పుల్కల్, పెద్దదేవాడ గ్రామాల్లో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం ఓటు అవశ్యకత ఓటు గొప్పతనం గ్రామ ప్రజలకు ర్యాలీ నిర్వహించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకటేశం, సంజీవరెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాల వసతుల కోసం సహాయం

నవతెలంగాణ-నసురుల్లాబాద్



సన్మానిస్తున్న పలువురు

మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి ప్రభుత్వ పాఠశాలకు మౌలిక సదుపాయాల కల్పన కొరకు నిజామాబాద్ జోసలుక్కాస్ వారి ఆధ్వర్యంలో సుమారు రెండు లక్షల యాభై వేల రూపాయల విలువ గల సామగ్రిని అందజేశారు. ప్రభుత్వ పాఠశాలకు విలువైన సామగ్రిని అందజేసిన జోసలుక్కాస్ మేనేజర్ స్మితేస్‌కు పాఠశాల ఉపాధ్యాయులు, పీఆర్టియు నాయకులు, గ్రామస్తులు వారికి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వరరావు, పిఆర్టియు నాయకులు కుషాల్, జి.హన్మాండ్లు, జి.భూషణ్, చందర్, రాజు, జోసలుక్కాస్ పీఆర్వో నరేందర్ ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగం చేయాలి

- **రాష్ట్ర సివిల్ సప్లై ప్రిన్సిపల్ సెక్రటరీ దేవేంద్రసింగ్ చౌహాన్**
- **ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన**

నవతెలంగాణ-కామారెడ్డి

వరి ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేయాలని రాష్ట్ర సివిల్ సప్లై ప్రిన్సిపల్ సెక్రెటరీ దేవేంద్ర సింగ్ చౌహన్ నిర్వాహకులను ఆదేశించారు. కామారెడ్డి మండలం ఉగ్రవాయిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కల్పించిన వసతులు, రిజిస్టర్లు, తూకాలు, నూతనంగా ప్రవేశ పెట్టిన ఐరిస్ విధానం, ట్యాబ్ ఎంట్రీలు పరిశీలించి, అధికారులు, నిర్వాహకులతో మాట్లాడుతూ నిబంధనల ప్రకారం రైతులు తమ ధాన్యాన్ని తాలు, మట్టి లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2203, గ్రేడ్-బి రకానికి రూ.2183 నిర్ణయించిదన్నారు. దళారులకు ధాన్యం విక్రయించవద్దని కోరారు. హార్వెస్టర్ యజమానులు గంటకు పంటపొలం కోయడానికి ఎంత ధర వసూలు చేస్తున్నారని రైతులను అడగగా.. రూ.1800 తీసుకుంటున్నారని రైతులు తెలిపారు. అనంతరం కామారెడ్డి మున్సిపల్ చివరిలో గల రాఘవేంద్ర రైస్ మిల్లును సందర్శించారు. రోజువారి లక్ష్యాల మేరకు మిల్లింగ్ పూర్తి చేయాలని రైస్ మిల్ యజమానులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున బాబు, ఇంచార్జ్ జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ నిత్యానంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ

సోమవారం రాత్రి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో ధాన్యం కొనుగోళ్ల పై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ధాన్యం సేకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలపై దిశా నిర్దేశం చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ధాన్యం తేమశాతాన్ని పరిశీలించి కొనుగోలుకు అనుమతి పత్రాన్ని ఇవ్వాలని దేవేంద్రసింగ్ చౌహన్ సూచించారు. ధాన్యం సేకరణ ప్రక్రియ ఎలాంటి ఒడుదొడుకులు లేకుండా సజావుగా, వేగవంతంగా జరిగేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గోనె సంచుల కొరత లేదని, కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన తేమను కొలిచే యంత్రాలు, గన్నీ సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు రైతులు ఎఫ్.ఎ.క్యూ ప్రమాణాలకనుగుణంగా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా వ్యవసాయ, సహకార అధికారులు అవగాహన కల్పించాలని, వారికి భరోసా ఇవ్వాలని అన్నారు. రెవెన్యూ, పౌరసరఫరాల, మార్కెటింగ్, వ్యవసాయ, ఐకెపి వంటి అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కొనుగోళ్ల ప్రక్రియ మరింత వేగవంతం చేయాలన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి వెంట వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తూ ట్యాబ్ ఎంట్రీ చేసి వారికి సకాలంలో డబ్బులు అందే విధంగా చూడాలన్నారు. మిల్లర్లు గడువు పొడగింపునకు అవకాశమివ్వకుండా లక్ష్యానికనుగుణంగా మరాడించాలని కోరారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు, రైస్‌మిల్లు యజమానులకు అవగాహన కల్పించారు. వ్యాగన్లు, గోడౌన్‌లో స్థలాల కోసం తన వంతు సహకారం అందిస్తానని మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. రైస్‌మిల్ యజమానుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు. గత యాసంగితో పోలిస్తే ఈ ఏడాది ముందస్తుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రారంభించామని తెలిపారు.

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. జిల్లాలో 350 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 22,794 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.13కోట్లు రైతులకు అందజేశామని తెలిపారు. జిల్లాలో గన్నీ బ్యాగుల కొరత లేదని చెప్పారు. ప్రతి కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున బాబు, జిల్లా పౌరసరఫరాల ఇంచార్జ్ మేనేజర్ నిత్యానంద్, జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, రైస్‌మిల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి అక్రమ మొరం రవాణా అడ్డగింత

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణంలో అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా అక్రమ మొరంను తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న గ్రామస్తులు సోమవారం అర్ధరాత్రి అడ్డుకున్నారు. అక్రమ మొరంను తరలిస్తే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో అక్రమ మొరంను తరలిస్తున్న నిర్వాహకులు అర్ధరాత్రి సమయంలో దందా కొనసాగిస్తున్నారు. సమాచారం అందుకున్న భిక్కనూరు పట్టణ వాసులు, యువకులు అక్రమ మొరంను అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది. మొరం తరలిస్తున్న వ్యక్తులకు పట్టణ వాసులకు కొద్దిసేపు వాగ్వాదం జరిగినట్లు సమాచారం. సిద్ధ రామేశ్వర ఆలయ సమీపం ఇతర ప్రాంతాల నుంచి మొరం తరలిస్తున్న వారిని పోలీసులు పట్టుకొని చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఒకవైపు రెవెన్యూ అధికారులు అక్రమ మొరం తరలించకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలు ఇచ్చామని తెలియజేస్తున్న పోలీసుల కండ్లు కప్పి మొరం దందాను కొనసాగించడంపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అక్రమం దందాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీరామ నవమికి ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-పిట్లం

ఆనవాయితీగా ప్రతి ఏటా నిర్వహించే శ్రీ రామనవమి పర్వదిన వేడుకలను ప్రజల సహకారంతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు, అడ్వకేట్ రామ్‌రెడ్డి మంగళవారము తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరామనవమి వేడుకలలో భాగంగా ఈనెల 17న శ్రీ రామచంద్రుని జననం, మహా అన్నప్రసాదం, సాయంత్రం శోభయాత్ర, 18న సాయంత్రం రథోత్సవం, ఆంధ్ర కళాకారుల డాన్స్ ప్రోగ్రాం, 19న దాతల సహాయంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ కుస్తీ పోటీలు, పరిసర ప్రాంత ప్రజలకు భోజన సదుపాయం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కుస్తీ పోటీలలో ఫైనల్ కుస్తీ వీరునికి 10 తులాల వెండి కడియం అందజేస్తామని చెప్పారు.

ఉపాధి కూలీలు ఉదయాన్నే పనికి రావాలి

- **ఎంపీడీవో సవిత రెడ్డి**



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-రామారెడ్డి

వేసవిలో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని, ఉదయా న్నే ఉపాధి కూలీలు పనిలోకి రావాలని ఎంపీడీవో సవితరెడ్డి కూలీలను ఉద్దేశించి అన్నారు. మంగళవారం మండలంలోని అన్నారం గ్రామ చెరువులో ఉపాధి కూలీల ద్వారా ఫిష్ ఫండ్ ఏర్పాటు చేస్తున్న పనులను ఏపీవో ధర్మారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొలతల ప్రకారం పనులు నిర్వహించి కూలీలు లబ్దిపొందాలని, పని ప్రదేశంలో తగినన్ని తాగునీరు ఏర్పాటు చేసుకోవాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీ, తదితరులు పాల్గొన్నారు.

కూనేపల్లిలో బాల్య వివాహం అడ్డగింత



కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కూనేపల్లి గ్రామానికి చెందిన 15 సంవత్సరాల బాలికకు నాందేడ్‌కు చెందిన కృష్ణ (24) అనే యువకుడితో వివాహం చేసేందుకు ఇరు కుటుంబాలు సిద్ధంగా కాగా.. ఈ విషయాన్ని 1098, 100కు సమాచారం ఇవ్వడంతో స్థానిక ఎస్సై సాయన్న సమాచారం మేరకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అధికారులు ఆ గ్రామాన్ని చేరుకున్నారు. మైనర్ బాలిక కుటుంబ సభ్యులతో కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్యంలో వివాహం చేస్తే జరిగే అనర్థాల గురించి వివరించారు. బాల్య వివాహం చేస్తే చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006 ప్రకారం కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకుంటామని గ్రామ పెద్దల సమక్షంలో ఈ విషయాన్ని అధికారులు వివరించారు. అమ్మాయిని బాల్ భవన్ చైల్డ్ వెల్ఫర్ కమిటీ ముందు హాజరు పరచనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కౌన్సెలింగ్‌లో ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి, బాల్య వివాహ నిరోధక చట్టం అధికారులు కౌన్సిలర్ జమురు, చైల్డ్ లైన్ టీం సభ్యులు ముజాహిద్, గ్రామ కార్యదర్శి కృష్ణ, పోలీస్ సిబ్బంది ప్రవీణ్, సునీత, మహిళా కానిస్టేబుల్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

- **జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావ్**

నవతెలంగాణ-పిట్లం

ఎండలు భగ్గుమంటున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీలలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా ఎండలు విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా ప్రజలు తాగునీటికై అలమటించకుండా చర్యలు చేపట్టాలని ఆయన పంచాయతీ సెక్రెటరీలకు ఆదేశించారు. గ్రామాలలో నిర్మించిన వాటర్‌ట్యాంక్, బోరుమోటర్లు, పైప్‌లైన్ చెడిపోయినట్లయితే నిర్లక్ష్యం చేయకుండా వెనువెంటనే స్పందించి రిపేర్లు చేపట్టి నీటిని అందించాలన్నారు. గ్రామాలలో నిర్మించిన వాటర్ ట్యాంక్ బోర్‌లలో నీటి సామర్థ్యం తగ్గడం వల్ల నీటి సమస్యలు తలెత్తినట్లయితే ట్రాక్టర్ వాటర్ ట్యాంక్‌ల సహాయంతో నీటిని అందించి ప్రజల దాహార్తి తీర్చాలన్నారు. ప్రజలకు అందించే తాగునీరు నిమిత్తం ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఎవరైనా పంచాయతీ సిబ్బంది, సెక్రటరీ నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వ పరంగా చర్యలు తప్పవన్నారు. పంచాయతీ పాలన, ఉపాధి హామీ కూలీలు తమ విధులను ఉదయం, సాయంత్రం వేళలో నిర్వహించుకుని వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డిఎల్‌పిఓ నాగరాజ్, ఎంపీడీవో కమలాకర్, ఎంపీఓ బ్రహ్మం, పంచాయతీ సెక్రటరీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు

నీటిని వృథా చేయొద్దు

- **పొదుపుగా వాడుకోవాలి**
- **నిజాంసాగర్ మండల ప్రత్యేక అధికారి విజయభాస్కర్**

నవతెలంగాణ-నిజాంసాగర్

రాబోయే రెండు నెలలు నీటిని పొదుపుగా వాడుకోవాలని నిజాంసాగర్ మండల ప్రత్యేక అధికారి, కామారెడ్డి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి విజయభాస్కర్ అన్నారు. మంగళవారం ఆయన నిజాంసాగర్ మండలంలోని మల్లూరు, అచ్చంపేట గ్రామాన్ని పరిశీలించారు. అనంతరం నిజాంసాగర్ మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారులతో, పంచాయతీ కార్యదర్శులతో నీటి సమస్యపై ప్రత్యేక రివ్యూ నిర్వహించారు. ప్రతి గ్రామంలో సింగిల్ ఫేస్ మోటార్ ఉదయం 7 నుంచి 10 గంటల వరకు తిరిగి సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు మాత్రమే నడిచేలా చూడాలని ఆయన ప్రత్యేక అధికారులకు ఆదేశించారు. ఈ రెండు నెలలు నీటిని ఎంత పొదుపుగా వాడుకుంటే అంత మంచిదని ఆయన అన్నారు. సింగిల్ ఫేస్ మోటార్ ద్వారా వృథాగా నీరు పోతుందని, అవి మా దృష్టికి వచ్చిందని ఆయన అన్నారు. ఈ నిబంధనలు ప్రతి గ్రామంలో అమలు చేయాలని ఆయన పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుమలత, ఎంపీడీవో గంగాధర్, ఎంపీఓ యాదగిరి, ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి విజయభాస్కర్

తృతీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు



వీడ్కోలు సమావేశంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డి (మర్కల్) నందు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రాధిక, వైస్ ప్రిన్సిపాల్ వి.రేణుక, అకాడమిక్ కోఆర్డినేటర్ కే.వనజ, అధ్యాపకులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. మిస్ ఫేర్ వెల్‌గా శ్రీహిత, ఫస్ట్ రన్నర్ అప్‌గా నందిని గెలుపొందారు. వీరిని కిరీటంతో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రాధిక సత్కరించారు.

మాజీమంత్రికి సన్మానం



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-బోధన్

బాబ్లీ ప్రాజెక్టు కేసులో బిలోలి తాలుకాలోని న్యాయస్థానానికి మంగళవారం హాజరైన ఏ.పీ మాజీమంత్రి బోండా ఉమాకు బోధన్ కమ్మ సంఘం ఆధ్వర్యంలో సంఘం భవనంలో కమ్మ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి కమ్మ సంఘ భవనాన్ని తిలకించి కమ్మసంఘ నాయకులను అభినందించారు. కమ్మ సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను సంఘం అధ్యక్షులు పళ్లెంపాటి శివన్నారాయణ ఆయనకు వివరించారు. కమ్మ సంఘం చేస్తున్న సేవల పట్ల ఆయన అభినందించారు. ఈ ప్రాంతంలోని రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గతంలో బాబ్లీ నీటి కోసం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కొనసాగిన పోరాటంలో మాజీ మంత్రి, గంగుల కమలాకర్, హనుమంతుషిండే, చింతమనేని ప్రభాకర్ మరి కొంతమంది నాయకులు మంగళవారం న్యాయస్థానానికి హాజరయ్యారు. కమ్మ సంఘంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సునీల్ కుమార్ చౌదరి, ఆంధ్రాబ్యాంక్ రిటైర్ ఉద్యోగి ముప్పానేని అప్పారావు, తెలుగుదేశం తెలంగాణ యూత్ రాష్ట్ర నాయకులు కొడాలి రవికుమార్, న్యాయవాది హనుమంతరావు, గాంధీ, వాసు, పావులూరు వెంకటేశ్వరరావు, రామ్మూర్తి తోపాటు పలువురు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు ఎక్కడ..?

నవతెలంగాణ-భిక్కనూర్

అనుమతులు ఒకటి చూపి నిర్మాణాలు మరొకటి చేపట్టిన అక్రమ నిర్మాణాలపై పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వాస్తవానికి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నప్పుడు అనుమతులు తీసుకున్న సమయంలో ఏ విధమైన మ్యాప్ చూపిస్తాము అదేవిధంగా ఇంటిని నిర్మించాల్సి ఉంటుంది. కానీ కొందరు పంచాయతీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెయ్యి తడిపితే ఎలాంటి నిర్మాణమైన చేపట్టొచ్చు అని చేతులు తడిపి ఇంటిని కాకుండా వ్యాపార సముదాయాలు నిర్మిస్తూ పంచాయతీ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఈ విధంగా జిల్లాలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడితే పంచాయతీ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడంపై ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా పంచాయతీ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతున్న పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుని పంచాయతీ ఆదాయాన్ని కాపాడుతారా..? తమకేసంబంధం లేదన్నట్టు వదిలేస్తారా వేచి చూడాల్సిందే.

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సన్మానం

నవతెలంగాణ-దోమకొండ

కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా గడ్డం ఇందు ప్రియా చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నికైన సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో దోమకొండ జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి మున్సిపాలిటీకి అన్ని విధాలా అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీతారాం మధు, రాజేశ్వర్, నాగేంద్ర వర్మ తదితరులు ఉన్నారు.



మున్సిపల్ చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న పలువురు

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



శ్రీకాంత్ మృతదేహం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతిచెందారు. ఈ ఘటన ఇందల్‌వాయి మండల కేంద్రంలో చోటుచేసుకుందిన. మండల కేంద్రానికి చెందిన మైస శ్రీకాంత్ (37) గ్రామంలోని పెద్ద చెరువులో చేపటు పట్టేందుకు వెళ్లి.. ప్రమాదవశాత్తు చెరువులోని పెద్ద కచ్చు కాలువలో పడిపోయాడు. కాళ్లకు వల చుట్టుకోవడంతో నీట మునిగి మృతి చెందాడు. మృతుడి అన్న మైస శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఎస్సై మనోజ్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఉపాధి హామీ కూలీలకు ఎయిడ్స్‌పై అవగాహన

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని పెద్ద చెరువు ప్రాంతంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ కూలీలకు వార్డ్ ఉమెన్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పిట్లం-నిజాంసాగర్ మండలాల కోఆర్డినేటర్ పద్మ మంగళవారం ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎయిడ్స్‌పై మహిళలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బ్యూటీ పార్లర్‌లలో ఒకరికి వాడిన వాటిని మరొక మహిళకు వాడకూడదని అవగాహన కల్పించారు. ఎక్కడబడితే అక్కడ చిరు తిండ్లు తినవద్దని, అక్కడ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులుంటే ఆ వ్యాధి సంక్రమించే విధానాన్ని, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అందుకుగాను మహిళలు జాగ్రత్తలు పాటించాలని, ఎయిడ్స్ సోకి జీవిస్తున్న వ్యక్తులు ఆత్మస్థైర్యంతో ఉండాలన్నారు. వారిపై ఎవరైనా చిన్న చూపు చూస్తే 2017 యాక్ట్ గురించి తెలియజేశారు. మహిళలపై గృహహింస, కిషోర్ బాలికలకిచ్చే హెల్త్ ట్రైనింగ్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ సంగమేశ్వర్, కూలీలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కో ఆర్డినేటర్ పద్మ

568 పశువులకు టీకాలు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని డీకంపల్లి గ్రామంలో పశు వైద్యశాల అధ్వర్యంలో పశువులకు ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను పశు వైద్యులు కిరణ్ దేశ్ పాండే మంగళవారం వేశారు. ఈ సందర్భంగా 568 పశువులకు ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ప్రతి రైతు తమ పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని, ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డా. ఉమమ సహెర్, విఎల్ఓ వినిత, విఏ అహ్మద్ పాషా, గోపాల మిత్ర సుదీర్, వ్యాక్సినేటర్ జైల్ సింగ్, సిబ్బంది శ్రీను, గంగాధర్, పుష్ప, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.


పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

జిజిహెచ్‌లో రోగులకోసం

తాగునీటికి ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిజామాబాద్‌లో తాగునీటి ప్లాంట్ (ఆర్ఓప్లాంట్) ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతిమారాజ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో రోగులకు వారి సహాయకులకు తాగునీటికి ఇబ్బంది ఉండకూడదని ఈ తాగు నీటి ప్లాంట్ (ఆర్ ఓ ప్లాంట్) ఏర్పాటు చేశామని మంగళవారం తెలిపారు. రోగులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేశ్వరావు , డాక్టర్ బాల్‌రాజ్, డాక్టర్ నరేంద్రకుమార్, డాక్టర్ కిరణ్, డాక్టర్ కమ్రాన్, డాక్టర్ హరీష్, డాక్టర్ సుజాత, డాక్టర్ స్వాతి మరియు ఆఫీసు సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



వరి కోనుగోలు కేంద్రాన్ని సందర్శించిన పీడీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని సంస్థాన్ సిర్నాపల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని డిఆర్‌డీవో పిడి సాయాగౌడ్, మార్కెటింగ్ డిపిఎం సాయిలుతో కలిసి మంగళవారం సందర్శించారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినప్పటి నుండి నేటి వరకు వరి ధాన్యాన్ని కొనుగోలు చేసిన వివరాలను ఏపిఎం సువర్ణను అడిగి తెలుసుకున్నారు. 10వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని, అందులో 2614 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు వివరాలు టాబ్‌లో ఎంట్రీ చేసినట్లు వివరించారు. ధాన్యం తరలించడానికి లారీ లు తొందరగా పంపించేవ చూడాలని, ప్రస్తుతం 2000 సంచుల వరకు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మహిళా సమైఖ్య అధ్యక్షులు సుజాత, కార్యదర్శి సబిత, విఓఏలు స్వప్న, సువర్ణ గ్రామ రైతులు, సీసీ ఉదయ్ పాల్గొన్నారు.

వంద మంది కూలీలు పనులకు హాజరు కావాలి

- ఎంపిడిఓ బాలకృష్ణ


మాట్లాడుతున్న ఎంపీడీవో బాలకృష్ణ

నవతెలంగాణ-ధర్పల్లి

గ్రామంలోని ఉపాధి కూలీలు నేటి నుండి కనీసం వంద మంది కూలి పనులకు తప్పక హాజరు కావాలని ఎంపిడిఓ బాలకృష్ణ గ్రామస్తులకు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మంగళవారం మండలంలోని కేశారం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటుచేసి గ్రామస్తులకు ఉపాధి హామీపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలో ఉపాధి పనుల్లో కేశారం గ్రామం చాలా వెనుక బడి ఉందని, కూలీలు రావడం లేదని అన్నారు. బుధవారం నుండి కనీసం వందమంది పనులకు వచ్చే విధంగా చూడాలని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్, గ్రామ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో మారుతి (29) సంవత్సరాలు అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. గ్యారేజ్ యజమాని తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం రాత్రి మృతుడు తాను పనిచేస్తున్న గ్యారేజ్ యజమాని నాగబాబు ఇంటి నుండి వెళ్లాడు. మంగళవారం ఉదయం తోటి డ్రైవర్లు డ్యూటీకి వెళ్లేందుకు మారుతి ఉంటున్న గ్యారేజ్‌కి వెళ్లారు. ఎంత పిలిచినా లేవకపోవడంతో అనుమానం వచ్చిన యజమాని 100 నెంబర్‌కు ఫోన్‌చేసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని శవాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్, ఎస్సై అశోక్ తెలిపారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలి

- ఏపిఎం రవీందర్ రెడ్డి


మాట్లాడుతున్న ఏపీఎం రవీందర్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలని ఐకెపి ఎపిఎం రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల సమాఖ్య కార్యాలయంలో సిబ్బంది సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపిఎం మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ కమిటీలు సక్రమంగా పనిచేసే విధంగా చూడాలన్నారు. అదేవిధంగా వచ్చే విద్యా సంవత్సరానికి మహిళా సంఘాల సభ్యులతో ఏకరూప దుస్తులను కుట్టించాలని సూచించారు. లోగోస్ యాప్ లో మహిళా సంఘాల్లోని సభ్యుల వివరాలను పూర్తిస్థాయిలో ఎంట్రీ చేసే విధంగా చూడాలన్నారు. విలేజ్ ఆర్గనైజేషన్ ఆర్థిక లావాదేవీల ఇంటర్నల్ ఆడిట్ గురించి పలు సూచనలు చేశారు. సిబిఓ ఆడిటర్ జనార్ధన్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, మండల సమైక్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

రైటర్, సింగర్ బొమ్మ రాముకు సన్మానం


బొమ్మ రామును సన్మానిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామానికి చెందిన రైటర్, సింగర్ బొమ్మ రామును గ్రామంలోని పెద్దలు, యువత, ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల రాము రచించి పాడిన అమ్మ సాంగ్ యూట్యూబ్‌లో తెలంగాణ వ్యాప్తంగా మంచి పేరు ప్రఖ్యాతలు రావడంతో హర్షం వ్యక్తం చేస్తూ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ బొమ్మ రాము మరిన్ని పాటలు రచిస్తూ, పాడుతూ గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో సినిమాలో కూడా అవకాశం వస్తే పాటలు రచిస్తూ పాడుతూ మంచి పేరు ప్రఖ్యాతలు పొంది గ్రామ యువతకు ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో హకీమ్, మెట్ పల్లి సురేందర్, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనక గంగాధర్, పిఇటి గంగాధర్, ఉపాధ్యాయులు మధుసూదన్, ధర్మేందర్, రవీందర్, రమేష్ కుమార్, భాగ్యలక్ష్మి, గంగామణి, శోభ, శైలజ, గ్రామ యువత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథలో వేలకోట్లు జేబుల్లోకి

- మతం, రాముడిని అడ్డుపెట్టుకుని బిజెపి నాటకం
- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

విద్య, ఉపాధి కావాలని, ఈసారి కాంగ్రెస్ నినాదం రాముని మొక్కుదం బిజెపిని తొక్కుదం అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నామని, ఈ సారి బిజెపి ప్రభుత్వం వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్తున్నారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. ఎస్సీ ఎస్టీలకు ఉన్న రిజర్వేషన్ పోతుందని అలా జరగకుండా ప్రజలు ఏకతాటిపైకి రావాలని తెలిపారు. మంగళవారం డిచ్ పల్లి మండలంలోని ఖిల్లా డిచ్ పల్లి సహకార సొసైటీ పరిధిలోని యానంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కోనుగోలు కేంద్రాన్ని మంగళవారం సందర్శించి రైతులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. అయోధ్యలో రామ్ మందిరంలో విగ్రహాల ప్రతిష్టాపన జరగక ముందే బాలరాముని పేరు మీద గ్రామాల్లో అక్షింతలు పంపిణీ చేసి మతం, రాముని పేరుతోనే ఓట్లు దండుకోవడానికి చేస్తున్న నాటకమని విమర్శించారు. మేము కూడా రామభక్తులేనని, పసుపు బోర్డు పేరుతో ఎంపీ అర్వింద్ జిల్లాకు చేసింది శూన్యమేనని, ఎంపీలుగా పనిచేసిన ఇద్దరు జిల్లాను ఎలాంటి అభివృద్ధి చేయలేదని, పోటీలో ఉన్న అర్వింద్, కవిత మాదిరిగానే ఆశాభంగం కలుగుతుందని అన్నారు. అనంతరం శ్రీకాంత్ ఏర్పాటు చేసిన ఎస్వి అల్కలిన్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి మాట్లాడుతూ వరి ధాన్యాన్ని ప్రభుత్వం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని రైతన్నలు ఎలాంటి ఆందోళన,


పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే

దిగులు చెందొద్దని తెలిపారు. ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతంగా చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటది వెంట రైస్ మిల్లులకు చేర్చాలని, రైతులకు 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు జమ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో దళారులదే రాజ్యం నడిచిందన్నారు. కల్వకుంట్ల కవిత లిక్కర్ స్కాంలో పట్టుబడి జైళ్ళో ఉన్నారని, తండ్రి కేసీఆర్ ధరణి భూములు అమ్ముకున్నారని, కొడుకు కేటీఆర్ పరీక్ష పేపర్లు అమ్ముకున్నారని ఆరోపించారు. ఐదేళ్ల క్రితం ఎంపి అభ్యర్థి ధర్మపురి అర్వింద్ పసుపు బోర్డు తెస్తానని చెప్పి, రైతులకు మోసం చేసి పసుపు బోర్డు పేపర్ మీద మాత్రమే ఉందని, ఏ గ్రామంలోనైన ఒక్క రూపాయి ఇవ్వకుండా ప్రజల కష్టసుఖాల్లో కూడా పాలు పంచుకోలేదని అన్నారు. అలాంటి వ్యక్తికి మరోసారి ఓటు వేసి వృదా చేయొద్దని సూచించారు. కాళేశ్వరం పేరుతో లక్షల కోట్లు తమ జేబులో వేసుకున్నారని,మేడిగడ్డ కుంగి పోయిందని, మిషన్ భగిరథ నీరు ఏ ఒక్కరూ తాగడం లేదని, ఆ నీరు స్నానం, అవసరాలకు ఉపయోగించాలని ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పేర్కొన్నారు. ప్రధాన మంత్రి మోదీ గుజరాత్‌కు చెందిన బడా వ్యాపారస్తులకు అండగా ఉండి కోట్లాది రూపాయలను బ్యాంకుల నుండి రుణాలు పొంది బయటి దేశాలకు పారిపోయారని, మొత్తం 19మంది ఎగవేతదారుల్లో 18 గుజరత్ కు చెందిన వారే నన్నారు. ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగులకు ప్రధాని మోడీమోసం చేశారని గుర్తుచేశారు. 95శాతం గుజరాత్ కు చెందిన వారే దేశాన్ని దోచుకున్నారని, మరోసారి అవకాశం ఇస్తే ఏమి మిగలకుండా మొత్తం గుజరాతీలకు కట్టబెడతరని మోడీని నమ్మొద్దని సూచించారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌పై విమర్శలు చేశారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలతో అభివృద్ధి సాధ్యపడదని, కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. అంతకు ముందు పలువురు కాంగ్రెస్ పార్టీ లో చేరారు. కార్యక్రమంలో సహకార సొసైటీ చైర్మన్ రంచందర్ గౌడ్, వైస్ చైర్మన్ కుమ్మరి చిన్న గంగారం, సిఈఓ కిషన్,ఇందల్ వాయి కాంగ్రెస్ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, డైరెక్టర్ రాజేశ్వర్, డాక్టర్ శాదుల్లా, డాక్టర్ జాహుర్, దాసరి రాము, డైరెక్టర్లు,మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమానురాగాలతో పండుగలు జరుపుకోవాలి

- ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్

నవతెలంగాణ-నవీపేట్

పండుగలను కుల మతాలకు అతీతంగా ప్రేమానురాగాలతో జరుపుకోవాలని తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ మైనార్టీ నాయకులు రంజాన్ పండుగ పూర్తయిన సందర్భంగా ఈద్ మిలాద్ కార్యక్రమాన్ని ఎస్ఆర్ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్‌తోపాటు కాంగ్రెస్ మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ రాజేందర్ కుమార్ గౌడ్, నాయకులు రవి, సంజీవరెడ్డి, కిరణ్, విజయ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత దేశంలో భిన్నత్వంలో ఏకత్వం ప్రత్యేకమైనదని, అందుకు అనుగుణంగా కుల మతాలకు అతీతంగా పండుగలను ప్రేమానురాగాలతో జరుపు కోవడం సంతోషంగా ఉందని అన్నారు. శ్రీరామనవమి పండుగను సైతం హిందూ సోదరులు వైభవంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మూస, బాబు, జహీర్, ముస్తాక్, గౌస్, జియా పాల్గొన్నారు.


తాహెర్‌ను సన్మానించిన పలువురు

బాసర ట్రిపుల్ ఐటీలో

అర్వింద్ ఆత్మహత్యపై విచారణ జరిపించాలి

- పిడిఎస్‌యూ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బాసర ట్రిబుల్ ఐటీలో పియూసి రెండవ సంవత్సరం చదువుతున్న అర్వింద్ ఆత్మహత్యపై సిబిఐ విచారణ జరిపించాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ యూనివర్సిటీలో లేని ఆత్మహత్యలు ఒక్క ట్రిబుల్ ఐటీ లోనే ఎందుకు జరుగుతున్నాయని, ప్రతి విద్యా సంవత్సరం పదుల సంఖ్యలో విద్యార్థుల ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రతి ఆత్మహత్యకు వ్యక్తిగత కారణాలను జోడించి చూపిస్తున్నారని, విద్యార్థులతో మాట్లాడ నివ్వకుండా క్యాంపస్ లో విద్యార్థి సంఘాలను అనుమతించడంలేదని, విద్యార్థుల ఆత్మహత్యల కారణాలు తెలుసు కోవడానికి గత సంవత్సరం రేవంత్ రెడ్డి గోడ దుకి లోపలికి పోయారని, వరుసగా జరుగుతున్న ఆత్మహత్యలపై సిబిఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

ట్రిపుల్ ఐటీని సీఎం సందర్శించాలి

- విద్యార్థి ఆత్మహత్యపై స్పందించాలి :ఏఐపీఎస్సీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

బాసర్ ట్రిబుల్ ఐటీ లో విద్యార్థి మరణం పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించాలని అఖిలభారత ప్రగతిశీల విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏఐపీఎస్ యు జిల్లా నిజామాబాద్ బాధ్యులు బోడ. అనిల్ మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లాలోని బాసర ట్రిబుల్ ఐటీలో అరవింద్ అనే విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి నేరుగా పర్యటించాలని అన్నారు. గతంలో విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పుడు నేరుగా పర్యటించిన ముఖ్యమంత్రి ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని అన్నారు ఈ మరణాలపై స్పందించి అక్కడి సమస్యల్ని పరిష్కరించే విధంగా చూడాలని అన్నారు గత ప్రభుత్వం విద్యారంగంపైన ఏ విధమైన తీరు ఉందో అదేవిధంగా విద్యారంగం గురించి కనీసం ఒక్క మాట కూడా మాట్లాడకుండా అసెంబ్లీ సమావేశాల్లో ఇతర అంశాల పైన స్పందించి విద్యా రంగంపై మౌనంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బాసర ట్రిబుల్ ఐటీలో సమస్యల్ని ప్రక్షాళన చేయాలని లేనిపక్షంలో అన్ని విద్యార్థి సంఘాలుగా బాసర ట్రిబుల్ ఐటీ ని ముట్టడించాల్సి ఉంటుందని అన్నారు.

బీఆర్ఎస్‌కు షాక్

కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంపీపీ, ఆలూర్ మండల అధ్యక్షుడు

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గం పరిధిలో బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఎంపీపీ పస్క నర్సయ్య , మున్సిపల్ వైస్ చైర్మన్ లింగగౌడ్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపిటిసిలు శ్రీనివాస్ గౌడ్ , మహేష్ గంగారెడ్డి, హన్మాండ్లు, భూమన్న, మాజీ సర్పంచ్ లక్ష్మి నారాయణ, మగ్గిడి దేవా రెడ్డి, ఆలూర్ గ్రామ అధ్యక్షులు మండల రజనీకాంత్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బాణాలు మల్లేష్, కొత్తూరు సునీల్, మగ్గిడి దేవా రెడ్డి పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బలపరచి ప్రజాస్వామ్యానికి మద్దతు ఇచేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్టు తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువా వేసుకున్నారు. కార్య క్రమంలో పలువురు నాయ కులు పాల్గొన్నారు.



చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు వేస్తున్న వినయ్‌కుమార్‌రెడ్డి

దేశ కీర్తిని చాటిన చక్రవర్తి అశోకుడు

నవతెలంగాణ -ఆర్మూర్

భారతదేశ కీర్తి ప్రతిష్టను ప్రపంచానికి చాటిన ఏకైక ధర్మ చక్రవర్తి మహా సామ్రాట్ అశోక చక్రవర్తి 2368వ జయంతి కార్యక్రమాన్ని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో దళిత, వామపక్ష, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ డివిజనల్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య, జమాతే ఇస్లామీ హింద్ కార్యవర్గ సభ్యులు మహమ్మద్ రఫీ, అబ్దుల్ జబ్బర్, మహమ్మద్ సాజిద్, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కన్వీనర్ మూగ ప్రభాకర్, ఉపాధ్యక్షులు షెట్పెల్లి నారాయణ, ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అంగరి ప్రదీప్, ఆర్మూర్ మున్సిపల్ కార్మిక సంఘ అధ్యక్షులు పింజ అశోక్ పాల్గొన్నారు. సామ్రాట్ అశోకుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 32 లక్షల 56వేల కిలోమీటర్ల సువిశాల అఖండ భారతాన్ని 42సంవత్సరాల పాటు ఏకచత్రాధిపత్యంగా పరిపాలించిన గొప్ప చక్రవర్తి అశోకుడని కొనియాడారు. ధర్మమే సమస్త జీవకోటిని రక్షిస్తుందని బలంగా నమ్మి గౌతమ బుద్ధుని ధమ్మ సందేశాన్ని విశ్వవ్యాప్తం చేసి తన రాజ్యంలో మానవ విలువలు పెంపొందించిన గొప్ప రాజు అని వారు అభివర్ణించారు. అశోకుడి ప్రజా సంక్షేమ స్వర్ణ యుగ పాలనలోని అశోక ధర్మ చక్రం మన జాతీయ పతాకంలో అలాగే సారనాథులోని అశోకుడు ప్రతిష్టించిన ఏకశిలా స్తంభం మీద నాలుగు సింహాల తలాటం మన దేశ అధికార ముద్రకు నిదర్శనం అని పేర్కొన్నారు. బుద్ధుడు, అశోకుడు, అంబెద్కర్ కళలు గన్న శోకం లేని,స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావంతో కూడిన పరిపాలన కొరకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాచర్ల సాయిరాం, ప్రకాష్, రాజేష్, మోహన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మంగళవారం సామ్రాట్ అశోక జయంతి వేడుకలు ఘనంగా నిర్వహింఎవరు మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు పింజ అశోక్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వికాస్, వెన్న రమేష్, ప్రభాకర్, సాయి, నారాయణ, ప్రదీప్, రఫీ తదితరులు పాల్గొన్నారు.


అశోకుని చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

డిగ్రీ, రెగ్యులర్ ఫీజుకు నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని మే, జూన్‌లో నిర్వహించే డిగ్రీ రెగ్యులర్ కోర్సులు బిఏ, బికాం, బిఎస్సి, బిబిఏ, రెండవ, నాలుగవ, ఆరవ సెమిస్టర్ ఫీజు వివరాలను తెలంగాణ యూనివర్సిటీ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో ప్రకటించారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా 25ఏప్రిల్ లోపు చెల్లించాలని వివరించారు. అపరాధ రుసుంతో రూ.100 తో 26ఏప్రిల్ వరకు ఉంటుందని, రూపాయలు.500తో 27 ఏప్రిల్ వరకు, రూపాయలు 1000తో 29 ఏప్రిల్ వరకు, రూపాయలు.2000 లతో 30ఏప్రిల్ వరకు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలు తెలంగాణ విశ్వవిద్యాల వెబ్సైట్లో పొందుపరచామని పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ డాక్టర్ ఎం. అరుణ తెలిపారు.

శ్రీరామనవమికి ముస్తాబైన సిద్దుల గుట్ట

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని ప్రసిద్ధి చెందిన సిద్దల గుట్టలోగల నవనాథ సిద్దేశ్వర ఆలయంలో శ్రీరామ నవమికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ఇక్కడకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్నిచోట్ల టెంట్లు, మంచినీటి సౌకర్యం కల్పించినట్టు చెప్పారు. గుట్ట కింద నుండి భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సుల సౌకర్యం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుమన్, పిసి గంగారెడ్డి, ప్రశాంత్ గౌడ్, కొంతం మంజుల మురళి, తదితరులు పాల్గొన్నారు.

అత్త మందలించిందని యువకుడి ఆత్మహత్య

- తాడ్వాయి మండలం దేమికలాన్‌లో ఘటన

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని దేమికలాన్ గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు తాడువాయి ఏఎస్ఐ సంజీవ్ తెలిపారు. మండలంలోని కన్కల్ గ్రామానికి చెందిన కౌడి శ్రీకాంత్ (23) చిన్నతనం నుంచి దేమికలాన్‌లో మేనత్త దగ్గర ఉంటున్నాడు. ఇంటర్ వరకు చదువుకున్న శ్రీకాంత్ వ్యవసాయం, వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి రాత్రి 11:30 గంటలకు ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఉన్న మేనత్త 'ఇంతసేపు ఎటు వెళ్లావు. రాత్రి వరకు ఇంటికి రాకుంటే ఎలా..?, ప్రతిరోజు తాగి తిరుగుతున్నావు.' అని మందలించడంతో ఆయన మనస్థాపానికి గురై అక్కడి నుంచి వెళ్ళిపోయి గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి సమయంలో శ్రీకాంత్ ఇంటికి రాకపోవడంతో మంగళవారం ఉదయం గ్రామ శివారులో వెతుకగా ఓ చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. ఈ విషయమై కౌడి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎలుగుబంటి సంచారం.. భయాందోళనలో గ్రామస్తులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ గ్రామ సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయానికి రహదారి పక్కన మంగళవారం రాత్రి ఎలుగుబంటి కనిపించడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. లింగంపేట్ గ్రామ సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయం వద్దకు వెళ్లే భక్తులు అమ్మవారి మొక్కలు తీర్చుకోవడానికి దూర ప్రాంతాల నుంచి వచ్చారు. రాత్రి తిరిగి ఇంటికి ద్విచక్ర వాహనాలపై వెళ్తుండగా మత్తడి పోచమ్మ ప్రధాన రహదారి గుట్ట పక్కన పంట పొలాల్లో ఎలుగుబంటి కనిపించడంతో భక్తులు, వ్యవసాయదారులు ఎలుగుబంటిని చూసి భయభ్రాంతులకు గురయ్యారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో మత్తడి పోచమ్మ సమీపంలోని పెద్ద వాగులో చుక్క నీరు లేకుండా పోయింది. మత్తడి పోచమ్మ ఆలయ సమీపంలోని బొబ్బిలి ఈరన్నగుట్ట నుంచి తాగునీటి కోసం పంట పొలాల వద్దకు ఎలుగుబంటి రాత్రివేళ రావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మత్తడి కిందిపల్లికి కూతవేటు దూరంలో ఎలుగుబంటి సంచరించడంతో కాలనీవాసులో ఏ క్షణంలో ఏం జరుగుతుందో అని భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి అటవీ ప్రాంతంలో వన్యప్రాణులు తాగునీటి కోసం ఏర్పాటు చేసిన సాసర్ పీట్లలో తాగునీటి నిల్వ ఉంచాలని పలువురు కోరుతున్నారు.

జహీరాబాద్‌లో త్రిముఖ పోటీ

- గెలుపుపై ఎవరి ధీమా వారిదే
- పోటాపోటీగా సమావేశాలు, ప్రచారాలు
- విజయం కోసం ప్రధాన పార్టీల కసరత్తు
- పల్లెల్లో పార్లమెంటు ఎన్నికల వాతావరణం


సురేష్ షెట్కర్


గాలి అనిల్‌కుమార్


బీబీపాటిల్

నవతెలంగాణ-లింగంపేట్

జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన పార్టీల మధ్య త్రిముఖ పోటీ కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు రావడంతో ప్రధాన పార్టీలు రాజకీయ యుద్ధానికి సిద్ధమవుతున్నాయి. ఈసారి ఎన్నికల్లో ఎలాగైనా సత్తా చాటుకోవాలని ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి. విజయంపై ఎవరి ధీమా వారే వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి ఇప్పటికే ప్రధాన పార్టీల నుంచి అభ్యర్థులను ప్రకటించారు. అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ ఎంపీ సురేష్ షెట్కర్, బిజెపి నుంచి మాజీ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్, బీఆర్ఎస్ నుంచి గాలి అనిల్ కుమార్ పోటీలో ఉన్నారు. ఇప్పటికే జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఆయా పార్టీల నాయకులు నియోజకవర్గ స్థాయి సమావేశాలను ఏర్పాటు చేసి కార్యకర్తలకు బలోపేతం చేస్తున్నారు. యుద్ధానికి సిద్ధం కావాలని నాయకులు పిలుపునిస్తున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఈసారి కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు పావులు కదుపుతోంది. మరోవైపు బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ జిల్లాలో సెంటిమెంట్ పట్టు సాధించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. బిజెపి పార్టీ మాజీ ఎంపీ బీబీ పాటిల్ తనకున్న పరిచయాలతో ప్రచారంలో దూసుకెళు న్నారు. విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇప్పటికే బీజేపీ గత కొన్ని రోజుల క్రితం లింగంపేట్, ఎల్లారెడ్డి, గాంధారి, బాన్సువాడ, జుక్కల్, మద్నూర్ ప్రాంతాల్లో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి కార్యకర్తల్లో నూతన ఉత్తేజాన్ని నింపింది. బిఆర్ఎస్ పార్టీ కామారెడ్డి, లింగంపేట్‌లో నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించి కార్యకర్తలను ఎన్నికల రంగంలోకి దించేందుకు ముందుకు నడుస్తోంది. మరోవైపు మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు ఆదివారం జరిగిన నియోజక వర్గస్థాయి సమావేశ అనంతరం రైతుల ఎండిపోయిన వరి పంట లను పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ సురేష్ శెట్కర్ తమదైన శైలిలో నియోజకవర్గాల వారీగా ముఖ్యమైన నాయకులతో పటు సామాన్య కార్యకర్తలను కలుస్తున్నారు.

గెలుపుపై ప్రధాన పార్టీల ఆశలు..

జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని ఈసారి కైవసం చేసుకోవడానికి ప్రధాన పార్టీలు పోటీపడుతున్నాయి. ఎవరి ధీమా వారే వ్యక్తం చేస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ స్థానంపై ప్రత్యేక దృష్టి సాధించింది. జహీరాబాద్ పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలకు గానూ ఎల్లారెడ్డి, జుక్కల్, నారాయణఖేడ్, ఆందోల్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. కామారెడ్డి స్థానాన్ని బీజేపీ, బాన్సువాడ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఏడు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు పెరిగింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపి పార్టీల కంటే ఓటు బ్యాంకు పెంచుకుంది కాంగ్రెస్ పార్టీ. మరోవైపు బిఆర్ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో కొత్త అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను బరిలో నిలపడంతో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్‌షిండే, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఇప్పటికే నియోజకవర్గంలో వారిగా సమావేశాలు నిర్వహిస్తూ ప్రచారానికి సిద్ధమవుతున్నారు. బీబీ పటేల్ రెండుసార్లు జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. మూడోసారి కైవసం చేసుకోవడానికి ఇటీవలే బీజేపీలో చేరారు.

పల్లెల్లో పార్లమెంట్ ఎన్నికల వాతావరణం..

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పల్లెల్లో ప్రధాన కూడలి, హెూటల్లు, చావడీల వద్ద ఎన్నికల చర్చ జరుగుతోంది. జహీరాబాద్ పరిధిలో ముగ్గురు బలమైన అభ్యర్థులు బరిలో ఉండడంతో ఇప్పటికే పల్లెల్లో రాజకీయ వాతావరణం నెలకొంది. దీంతో ప్రధాన పార్టీలు చాప కింద నీరులాగా ప్రచారాస్త్రాలు మొదలు పెడుతున్నారు. ఇప్పటికే ఆ పార్టీలో నుంచి ఈ పార్టీలోకి.. ఈ పార్టీ నుంచి ఆ పార్టీలోకి చేరికలు మొదలయ్యాయి.

ఘనంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్టాపన

- ఆలయం వద్ద మహా చండీయాగం



నవతెలంగాణ-బోధన్

మండలంలోని ఎరాజ్‌పల్లి గ్రామంలో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం సభ్యులు గంగమ్మ తల్లి ఆలయం వద్ద వేద పండితులతో మంత్రోచ్చారణ చేస్తూ భక్తిశ్రద్ధలతో మహా చండీయాగం నిర్వహించారు. గంగ పుత్ర కులస్తులు, సంఘం సభ్యులు, భక్తులు చండీయాగంలో పాల్గొన్నారు. బుధవారం విగ్రహమూర్తుల ప్రాణప్రతిష్టాపన కార్యక్రమం ఉంటుందని గంగ పుత్ర కుల సంఘం అధ్యక్షులు సుట్టాకుల సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో గంగ పుత్ర సంఘం ఉపాధ్యక్షులు కర్రోల చిన్న లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మణ్, సభ్యులు మదారీ, శంకర్, గాలయ్య, సతీష్, సాయికుమార్, కులపెద్దలు, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీరామనవమికి ముస్తాబైనా రామాలయాలు

నవతెలంగాణ-రెంజల్/పోతంగల్

శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని మండలంలోని రామాలయాలను గ్రామ అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం ముస్తాబు చేశారు. మండలంలోని రెంజల్, బాగేపల్లి, నీలా క్యాంపు, వీరన్నగుట్ట, కందకుర్తి తదితర గ్రామాలలో బుధవారం సీతారాముల కళ్యాణోత్సవాన్ని పురస్కరించుకుని అన్నీ ఏర్పాట్లు సిద్ధం చేశారు. సీతారాముల కల్యాణోత్సవం అనంతరం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

నేడు సాయిబాబా జన్మదిన వేడుకలు, సీతారాముల కల్యాణం

పోతంగల్ : సాయిబాబా జన్మదిన వేడుకలు, అలాగే 12 గంటలకు సీతారాముల కళ్యాణ మహెూత్సవాలను బుధవారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దేవేంద్ర సింగ్ చౌహాన్


మాట్లాడుతున్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి

నవతెలంగాణ-నిజామాబాద్

రాష్ట్రంలోని రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేస్తున్నామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దేవేంద్ర సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులు, రైస్ మిల్లర్లు ఇబ్బందిపడకూడదనే భావనతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని అన్నారు. జిల్లా పర్యటనకు హాజరైన ప్రిన్సిపల్ సెక్రెటరీ డీ.ఎస్.చౌహాన్.. నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో రైస్ మిల్లర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం సేకరణ, బిల్లుల చెల్లింపులు, సీఎంఆర్ కేటాయింపులు తదితర వాటిపై ప్రభుత్వం చేపడుతున్న చర్యల గురించి వివరించారు. ఇదివరకటితో పోలిస్తే రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మిల్లింగ్ తదితర అంశాలలో ప్రస్తుతం పరిస్థితిలో ఎంతో మార్పు వచ్చిందని, స్పష్టమైన ప్రగతి కనిపిస్తోందన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం నుండి కూడా ఆశించిన రీతిలో సహాయ, సహకారాలు లభిస్తున్నాయని ప్రిన్సిపల్ సెక్రెటరీ తెలిపారు. 2018 - 2019 సంవత్సరం నుండి పెండింగ్ లో ఉన్న ట్రాన్స్ పోర్ట్ చార్జెస్ విషయమై భారత ఆహార సంస్థతో సమావేశం నిర్వహించి, సంబంధిత కేంద్ర ప్రభుత్వ అధికారులను ఒప్పించి రూ. 900 కోట్ల నిధులను మంజూరు చేయించామని గుర్తు చేశారు. దీనివల్ల మిల్లర్లకు ఎంతో లాభం జరిగిందని అన్నారు. ఇదే విధంగా గత చాలా కాలం నుండి పెండింగ్ లో ఉన్న హ్యాండ్లింగ్ చార్జెస్ బకాయిలను సైతం ఇప్పించేందుకు గట్టిగా కృషి చేస్తున్నామని, మరో నెల, రెండు నెలల వ్యవధిలో ఈ సమస్య కూడా పరిష్కారం అవుతుందని ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆశాభావం వ్యక్తం చేశారు. వీటితో పాటు ఇతర సమస్యలను సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వారి పరిష్కారానికి చొరవ చూపుతామని అన్నారు. అయితే, సీ.ఎం.ఆర్ కేటాయింపులు లక్ష్యానికి అనుగుణంగా సకాలంలో జరిగేలా ధాన్యం మిల్లింగ్ చేయాలని మిల్లర్లకు సూచించారు. ముఖ్యంగా పారాబాయిల్డ్ బియ్యం నిల్వల అవసరం ఎక్కువగా ఉన్నందున ఏమాత్రం విరామం లేకుండా మిల్లింగ్ జరిపించాలని అన్నారు. తెలంగాణతో పాటు కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు సైతం మన రాష్ట్రం నుండే బియ్యం ఎగుమతి జరుగుతున్నందున నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. మిల్లింగ్ విషయంలో నిజామాబాద్ జిల్లా రైస్ మిల్లర్లకు మంచి పేరు ఉందని, దానిని నిలబెట్టుకోవాలని సూచించారు.

పాఠశాలలో ప్రాథమిక పనులను చేపట్టాలి

- ఎంపీడీవో సతీష్ కుమార్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

పాఠశాలలో విద్యార్థులకు అవసరంఉన్న ప్రాథమిక పనులు చేపట్టాలని ఎంపీడీవో సతీష్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని మునిపెల్లి లక్ష్మాపూర్ గ్రామాల్లోని పాఠశాలలను ఎంపీడీవో సందర్శించి అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులతో స్థానిక ప్రధానోపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో తాగునీరు టాయిలెట్స్ కరెంటు సరఫరా తదితర అవసరాలను తీర్చి విద్యార్థులకు మంచి చదువును అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ సురేంద్ర వర్మ ఐకెపి ఎపిఎం రవీందర్ రెడ్డి పలు గ్రామాల అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు స్థానిక ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్


కామారెడ్డి : ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్


సదాశివనగర్ : వైద్యులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి/సదాశివనగర్

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించి ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో శక్తివంతమైన ప్రజాస్వామ్యంలో ఓటరు భాగస్వామ్యం అంశంపై స్వీప్ అండ్ పొలిటికల్ సైన్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒక రోజు వర్క్ షాప్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల వ్యవస్థలో వస్తున్న పరిణామాలు విశ్లేషిస్తూ ప్రజాస్వామ్య ప్రక్రియలో యువతను భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశ్యంతో భారత ఎన్నికల సంఘం వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నదన్నారు. దేశ హితం, దేశ సంక్షేమం కోసం సమాజాన్ని చైతన్యం చేయ డంలో యువత తమ వంతు పాత్ర పోషించాలన్నారు. ఓటు హక్కు వినియోగంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మన దేశం మెరుగైన స్థితిలో ఉండడం, పారదర్శకంగా వివి ప్యాట్ ద్వారా ఓటు వినియోగం తెలుసుకోవడంతో పాటు పకడ్బందీ వ్యవస్థ వల్ల 12గంటల్లో ఫలితాలు వెల్లడిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్య విలువలు పూర్వ కాలం నుంచి ఉన్నాయని వాటిని కాపాడుతూ దేశాభివృద్ధికి పాటు పడాలన్నారు. పొలిటికల్ పవర్‌తో ఏమైనా చేయవచ్చని, దానిని నియంత్రించేది ఓటరు అని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వంద శాతం వినియోగించుకోవాలన్నారు. తమతో పాటు కుటుంబ సభ్యులు ఇరుగుపొరుగు వారు, స్నేహితులతో ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా ఓటు వేసేలా అవగాహన కలిగించాలన్నారు. ఈ సందర్భంగా ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రఘునాథరావు, స్వీప్ అధికారి వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ప్రొఫెసర్లు కిష్టయ్య, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మౌలిక వసతులు పూర్తి చేయాలి

పాఠశాలలో మౌలిక వసతులైన విద్యుత్, తాగునీరు, చిన్న చిన్న మరమ్మతు వంటి పనులు త్వరితగతిన పూర్తి చేయవలసినదిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేసిన కామారెడ్డి మండలం గర్గుల్ ఎంపిపిఎస్ పాఠశాలను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేపట్టిన వివిధ పనులను పరిశీలించారు. 20 లీటర్ల సామర్థ్యం గల రెండు ఆర్.ఓ.లను ఏర్పాటు చేయాలని, టాయిలెట్ శుభ్రంగా ఉంచాలని, గచ్చు ఊడిపోయిన చిన్న చిన్న మరమ్మతులు, పాఠశాల పునరుద్ధరణ పనులు గడువులోగా పూర్తిచేయాలన్నారు. ఆఫీస్‌రూమ్ కారిడార్‌లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఎంఈఓ ఎల్లయ్య, గ్రామ మహిళా సంఘం అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

వేసవికాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి

సదాశివనగర్ : వేసవి కాలంలో ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలను వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. సదాశివనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో నిల్వ ఉన్న ఓఆర్ఎస్ ప్యాకెట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు, కొను గోలు కేంద్రాల వద్ద రైతులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉండే విధంగా చూడాలని ఆశాకార్య కర్తలను కోరారు. ప్రతి ఆశాకా ర్యకర్త వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అదనంగా ఉంచాలని సూచిం చారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్ సింగ్, వైద్యురాలు శిరీష, సూపర్‌వైజర్ లీలావతి, ఆరోగ్య విస్తీర్ణ అధికారి నాగరాజు, ఫార్మసిస్ట్ ప్రణయ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో పనులు చేయాలి..

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు సాధ్యమైనంతవరకు తక్కువ ఖర్చుతో పూర్తి చేసే విధంగా అధికారులు ప్రతిపాదనలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మండలంలోని తుక్కోజివాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం కలెక్టర్ సందర్శించారు. పాఠశాలలో చేపట్టవలసిన పనులను గుర్తించారు. అధికారులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చి మార్గనిర్దేశం చేశారు. అనవసరమైన పనులు చేయవద్దని సూచించారు. ఎంపీడీవో సంతోష్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి యూసెఫ్, కాంప్లెక్స్ ప్రధానోపా ధ్యాయుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య, లింగం, ఎంపీవో సురేందర్‌రెడ్డి, డి బాలలింగం, జై మారుతి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని షట్పల్లి గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ శర్మ అనే ఉపాధ్యాయుని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ఉత్తర్వులు జారీ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి రామస్వామి తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలపట్ల సదరు ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు విద్యార్థులు షీ టీం సిబ్బంది దృష్టికి తీసుకురాగా.. పోలీసులు ఈనెల 3న సదరు ఉపాధ్యాయుడిపై ఫోక్సో కేసు నమోదు చేశారు. 4వ తేదీన సదరు ఉపాధ్యాయుడిని రిమాండ్‌కు తరలించారు. ఉపాధ్యాయుడి తీరుపై మండల విద్యాశాఖ అధికారి రామస్వామి, కామారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదిక సమర్పించగా విచారణ చేపట్టి సస్పెన్షన్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారని మండల విద్యాశాఖ అధికారి రామస్వామి తెలిపారు.

కార్యకర్తకు అండగా ఉంటా

- రాత్రంతా నిమ్స్ ఆసుపత్రిలోనే ఉంటూ భరోసా కల్పించిన ఎమ్మెల్యే.. మెరుగైన చికిత్స అందించాలని సూచన


కార్యకర్త ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రానికి చెందిన చౌలవార్ హనుమాన్లు స్వామి ప్రమాదంలో గాయాలపాలయ్యారు. ఆయనకు జరిగిన ప్రమాదం గురించి తెలుసుకున్న జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మికాంతారావు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. సోమవారం రాత్రంతా ఎమ్మెల్యే ఆసుపత్రిలోనే మకాం వేసి ఆసుపత్రి వైద్యులతో గాయపడ్డ కార్యకర్త గాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్సలు అందించాలని సూచించారు. జుక్కల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యే పనితీరుపై అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి ఆసుపత్రిలోనే మకాం వేసి కార్యకర్తను కాపాడుకోవడానికి ఎమ్మెల్యే అందించే కృషి కార్యకర్తలకు అండ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని నిరూపించుకున్నారు. ఎమ్మెల్యే వెంట సాయిపటేల్, నాయకులు ఉన్నారు.

తాగునీరు అందించడంలో నిర్లక్ష్యం వద్దు

- కందకుర్తిని సందర్శించిన ప్రత్యేక అధికారి


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

నవతెలంగాణ-రెంజల్

తాగునీటిపై నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు తాగునీటిని అందించాలని రెంజల్ తహసీల్దార్, గ్రామ ప్రత్యేక అధికారి ఎంఏ కలిం అన్నారు. మంగళవారం మండలంలోని కందకుర్తి గ్రామపంచాయతీనీ ఆయన సందర్శించారు. గ్రామపంచాయతీ రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, ఆశాలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. రాబోవు పార్లమెంటు ఎన్నికలను పరిష్కరించుకొని బిఎల్వోలు ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి ఓటర్లకు సహకరించి వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. గ్రామ కార్యదర్శి సతీష్ చంద్రను అడిగి గ్రామంలోని సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కారోబార్ సాజిద్, ఆరోగ్య కార్యకర్త జానకి, అంగన్వాడీ కార్యకర్తలు గంగాజమున, బాలహంస, రజియాసుల్తానా, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

యువకులు రక్తదానంలో ముందుండాలి

- అత్యవసర సమయంలో రక్తదానం చేసిన భాస్కర్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త హీనతతో చికిత్స పొందుతున్న లింగయపల్లి గ్రామానికి చెందిన కోరే ఎల్లయ్యకు ఏ పాజిటివ్ రక్తం అత్యవసరం కావడంతో వారి కుటుంబ సభ్యులు జిల్లా రక్తదాతల సేవాసమితి నిర్వాహకులను సంప్రదించారు. భిక్కనూర్ మండల కేంద్రానికి చెందిన బీజేవైఎం నాయకుడు బక్కన్నగారి భాస్కర్ సహకారంతో వారికి కావలసిన ఏ పాజిటివ్ రక్తం సకాలంలో అందజేసినట్టు జిల్లా రక్తదాతల సేవా సమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్, ముదాం శ్రీధర్ పటేల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులు రక్తదానానికి ముందుకు వచ్చి ఎదుటి వారి ప్రాణాలను కాపాడే భాధ్యత ప్రతి యువకుడిదని తెలిపారు.

ఉపాధి కూలీలకు కూల్‌వాటర్ అందజేత


కూలీలకు కూల్ వాటర్ అందజేస్తున్న మాజీ సర్పంచ్

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ పాముల సాయిలు మాతృదేవోభవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధిహామీ కూలీలకు చల్లని నీటిని అందించి కూలీల దాహం తీర్చడానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ పి.సాయిలు, గ్రామ కార్యదర్శి శ్రీకాంత్, క్షేత్ర సహాయకులు గోపి, కారోబర్ మహేష్, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.